# శ్రీమతులలో శశి

ఆరాత్రి శశి ఇలా చేస్తుందని అతను ఎలా అనుకోగలడు ? శశిమీద అతను ఏవేవో కలలు కనేస్తూ కూర్చున్నాడు. అసలు కలలు గనేటటువంటి మనిషి, తప్పకుండా తియ్యని కలయొక్క అమ్మాయి స్వరూపం అయిఉంటాడేమో అనుకున్నాడు. 'ఔనౌను...అంతే...అంతే మనుషుల్లో ఆడ, మగ ఉన్నట్లు కదూ...' అనుకొని చిరునవ్వొకటి ఒలకబోసుకున్నాడు. పాపం చేతిలో తెఱచిఉంచిన పుస్తకం, ఆవులిస్తూన్న మాటమరచిపోయి, మరోసారి నవ్వుకున్నాడు.

ఇంతలో ఏదో అలికిడైంది. 'అదిగో....శశి...నాఅందాల ప్రేయసి, సామాను సర్దేసి, వంటవసారా విడిచేసి, అదిగో— పావురాయిలా, సెలయేటి పాయలా, చల్లని గాలిలోని హాయిలా రివురివ్వున వస్తోంది' అనుకున్నాడు. ఆ దిశవైపు మెడవంచి, దడదడలాడే గుండె గెడతీసి చూసేసరికి, ఆ చిన్నది వెనుదిరిగి వెళ్ళిపోతున్న సవ్వడైంది. అతనికి నిరుత్సాహం రెట్టింపయింది. మొగంమీద, గుండెలమీద గసగసాలంతలేసి స్వేదబిందువులు రుసరుస లాడాయి. గబగబా వెళ్ళి, అతను కిటికీరెక్కలు బారెట్టి, అక్కడ చల్లనివాయుకుమారులకు ఘనస్వాగత మివ్వడానికి, హడావుడిపడ్డాడు. కాని ఆ రాకుమారులు రాలేదు.

అప్పుడే శశి, హఠాత్తుగా అక్కడికొచ్చేసింది. 'అరరే... శశి వచ్చేసిందే....శశి వచ్చేసిందే....' అనుకున్నాడు. 'గాలి

వీస్తే బాగుండును....చల్లగా వీస్తే సుఖంగా ఉండును...' అని ఎంతో ఎంతో అనుకున్నాడు. కాని ఏమి లాభం ?

పకపక నవ్వుతూ వచ్చిన శశి, 'మిమ్మల్నిలా బాధ పెడుతూన్నందులకు క్షమించండేఁ....అబ్బేఁ. కాదు కాదు మిమ్మల్నిలా ఏడిపించవలసిందే'...అన్నధోరణి ఆ నవ్వులో ప్రకటించింది. ఇంతలో మనసు మార్చుకున్నట్లు, మొగంలోని భావాలను తారుమారు చేసింది. తన వాలుజడతో అతని మొగంమీద ఏవేవో ఎక్స్పరిమెంట్స్ (Experiments) చేస్తూ సైన్సు విద్యార్థినిలా కావలసిన కొలతలు తీసుకుంది. మెల్లిగా ఎంతో చల్లగా, 'ఏమండీఁ...' అంది.

అతనికి పాపమేమి మాట్లాడాలో తోచలేదు. 'అదేమిటో చెప్పేసెయ్...వినడానికి సిద్ధంగా ఉన్నాను.' అన్నట్లుగా మొగాన్ని దీపాలు లేని దేవాలయం చేసుకున్నాడు. పాపం! అప్పుడతనికి నవ్వాలని లేకపోయినా, నవ్వపోతే శశి ఎక్కడ ఏడ్చిపోతుందో అని; ఏంచక్కటి నవ్వునొకదాన్ని ఎంచి, దేవుడి పటానికి తగిలించిన పూలదండలా దాన్ని మొగానికి తగిలించుకున్నాడు. ఓఁ! ఇంకేం శశి కామాత్రం నవ్వుచాలు !

అప్పుడే ఈ జంటను, ఆకసంలోంచి తొంగిచూస్తూన్న ఒయ్యారపు చుక్కలు, చూడ్డానికి మాకుకళ్ళే ఉన్నాయి కాని, మీతో మాట్లాడటానికి మాకు నోళ్ళుకూడా ఉంటే ఎంత బాగుండును...' అని ఎంతో ఎంతో యిదైపోయాయి. రామం తొమ్మిదౌతూన్న గడియారంవంక కళ్ళుత్రిప్పి అడగ్గాడదనుకుంటూనే, ఉండబట్ట లేక కాబోలు, 'ఏమిటీ...కథఁ' అనేశాడు.

కథా నిలయం
1339

శశి, తన మనసులో 'వెరిగుడ్ వెరిగుడ్...' అనుకుంది. అంత ఆమె తనూలత, అతనికి మరింత దగ్గరగా జరిగింది. ఆమీదట 'నాకసలు ఇష్టం లేదండీ...కాని...' అని ఏమిటో గుణిసింది. ఈ తలా తోకా లేని మాటకు అర్థం రామానికి బాగా తెలుసు. అది ఒకటో రకం గోతులు త్రవ్వేసే గునపం! అదే మరి ఆడవాళ్ళ వశీకరణ మంత్రమని పాతరికార్డులు మరీ మరీ ఘోషిస్తూన్న సంగతి అతనికి పూర్తిగా తెలుసు.

అంతే...వెంటనే శశి, రామాన్ని చూపుల్తో లక్ష పరీక్షలు చేసేసింది. తెలివిగా, 'అబ్బ! ఈ సావిత్రిగారికి మరేం పనిలేదు...' అంది. అప్పుడు సావిత్రిమీద, శశికెంతో కోపం వచ్చింది. తిరిగి రామాన్ని ఒకసారి ముచ్చటగా చూసుకొని, 'వెళ్ళకపోతే ఒక బాధ....వెళ్తే ఒక బాధ' అంది.

ఇంకేముంది! రామానికి పూర్తిగా అర్థమై పోయింది. ఆ వాడలోని ఆడ పటాలమంతా, సినిమాకు బయలుదేరింది. అంతే... ఈవిడగారు పర్మిషను కోసం, ఇంత వినయ విధేయతలతో అప్లికేషను పెట్టుకుంటోంది. 'ఓయి దేవుడా... ఇదెక్కడి గోలయ్యాః...మా పాలిటి యముడులా ఉంది ఈ సావిత్రి...' అనుకొని, పైకి అలా అనడం, ఆటవికుల లక్షణం అని తోచి ఆ ప్రయత్నంనుంచి విరమించుకొని, ఎలా అయినా ఆనాటికి శశిని, ఈ ప్రోగ్రామ్‌నుంచి తప్పించెయ్యాలనుకొని ఎంతో ఎంతో ఆలోచించాడు.

ఆగిపోమని సూటిగా చెప్పడానికి అతనిలో సముద్రమంత గర్వం ... ఆకసమంత అభిమానం, విస్తరించి క్రిందా మీదా పహారాకాయడం మొదలుపెట్టాయి. ఇంతలోనే మెరుపులాంటి

ఆలోచన చటుక్కున అతని బుర్రలో మెరిసి,'మరినీకు వెళ్ళాలని లేదుగా....' అన్నాడు. తన జ్ఞాపకశక్తికి ఎలాంటి పైప్రిజివ్వాలో తరువాత సావకాశంగా ఆలోచించాలనుకున్నాడు.

అప్పుడు శశి, తనమొగాన్ని చిలుక కొట్టేసిన జామ కాయలాపెట్టి, 'ఔననుకోండి....కాని వాళ్ళంతా ఏడుస్తా రండి....మీరు వెళ్ళమన్నా(...నేనే మానేస్తున్నానని, ఎలా నవ్వుతారనుకున్నారు అబ్బ! వాళ్ళలా నవ్వితే చచ్చేంత సిగ్గే స్తుంది బాబూ...' అంది.

వెంటనే రామం,'నువ్వింత పిరికిదానివనుకోలేదు శశీ....' అన్నాడు. రామం తెలివితేటలు ఇలాంటి సమయాల్లో అమోఘంగా పనిచేస్తాయి! అందులో అప్పుడే చల్లగా గాలివీస్తోంది కూడాను. ఆగాలి లేడీ రామారావుగారు, ప్రేమతో పెంచుకుంటూన్న నైట్ క్వీన్ మొక్క ఒడిలోంచి మాంచి ఉషారుగా వస్తోంది మరి!

శశి, "అదేమిటండి...అలా అంటారు....ఇందులో పిరికితనం ఏముంది...బలేవారే..." అంది.

రామం చురుగ్గా " కాకపోతే మరేమిటమ్మా " అన్నాడు కంఠం సుతారంగా సాగదీసి.

" పోనీండి....మీకసలు నన్ను సినిమాకు పంపాలని లేదనగూడదూ...." అంది. ఆమె మొగంలో కోపంబాపతు పరమాణువులు చురచుర కాకర పువ్వొత్తుల్లా విచ్ఛిన్నమై పోతూండటాన్ని దాచుకో లేకపోయింది.

పాపం రామం, "అంతేలే శశీ.... నేను వెళ్ళొద్దనగానే, ఆ ముక్క కాస్తా వాళ్ళ చెవిలో ఎంచక్కా మా ఆయనగారు

వెళ్ళొద్దన్నారండీ—అని ఊదేసి నన్ను వాళ్ళముందు అడవి మృగాన్ని చేసేద్దామనేగా నీ ఉద్దేశం..." అన్నాడు. అలా అని ఒక్కసారి ఉక్కిరి బిక్కిరై పోయాడు.

వెంటనే శశి, "అవ్వా...అవ్వా...ఎందుకండీ అలాంటి మాటలు...అలాగంటే ఇలాగా....ఇలాగంటే అలాగా...." అని నోరు నొక్కుకుంది.

అప్పుడే దొడ్డి గుమ్మందగ్గర తలుపు దడదడ లాడింది. ఒక సన్నని కంఠం, "అక్కయ్యగారూ అక్కయ్యగారూ.... అబ్బ ! ఇంత లేటయితే ఎలాగండి...సావిత్రి పిన్ని మీరు వస్తారా...రారా అని అడగమంటోంది" అంది.

పాపం శశి గుండె బీటలు పడిపోయింది. "ఉండుపాపా... ఒక్కక్షణం...ఇది వచే చ్చస్తున్నా... అని (మాయదారి గోలొచ్చిందమ్మా ఈమనిషితో అని మనస్సులోనే అనుకొని) భర్తవైపు తిరిగి పసిపిల్లలా మొగంపెట్టి, ఏమండీ....ఏమిచెప్ప మంటారు...." అంది. బాబ్బాబు.... ఈఒక్క సారికీ ఒప్పు కుందురూ. ఈ సావిత్రితో బ్రతకడం కష్టం...అన్నట్లుగా ఆమె కంఠం పాపం నీరసపడి పోయింది.

తన ముద్దుల ప్రేయసి పడుతున్న కష్టాన్ని ఆకళింపు చేసుకున్న అలోచనల రామం ఒక్కసారిగా జారిపోయి, "సరే శశీ.... నీకు వెళ్ళాలని ఉంటే వెళ్ళు... నేనేమి అడ్డుపెట్టను..." అన్నాడు. అనడమైతే అన్నాడేగాని, ఆమాటల్లో మరొకర్థం తనకు తెలియకుండానే పిల్లిలా దూరి కూర్చుందని కానలేక పోయాడా పిచ్చివాడు. ఆ అర్థం కాస్తా 'మ్యావ్' మంది. శశికి చెవుల్లేక పోతేగా వినబడకపోవటానికి! ఆమె విననే వింది.

అంతే. వెంటనే గబాలున విసురుగా తిరిగి కస్సున, 'సరేలెండి రానని చెప్పేస్తాను' అంటూ దొడ్డిగుమ్మంవైపు రుసరుస లాడుతూ వెళ్ళిపోయింది.

రామన్న గాలి ఓదార్చింది. 'అయ్యో వెళ్ళాలని ఉంటే వెళ్ళు'....అని, ఎందుకన్నాను చెప్మా....చొచొ...ఎంతపనైంది... అని గుండెలతో దుఃఖించాడు. అతనివైపు పాపం చుక్కలు జాలిగా చూశాయి. వెంటనే రామాని కేమితోచిందోకాని గభాలునవెళ్ళి ఆ కిటికీ రెక్కలు భడాలున మూసేశాడు. కాని వెంటనే, అతనికి 'ఓం...శశి,మరి.... ఆ....అ...సినిమాకు వెళ్ళడంలేదు కదూ....' అని తట్టి 'ఆరి నీ తెలివిబంగారం గానూ... తీసెయ్... తీసెయ్... కిటికీరెక్కలు ఊ...త్వరగా వాటిని మూసేస్తావెందుకూ....'అని చేతులకు పనిచెప్పి, కిటికీని తిరిగి యథాప్రకారంగా తెఱచేశాడు. 'అంతేనోయ్ రామం... రెక్కలున్న కిటికీ ఎక్కడికి ఎగురుతుంది.... కాళ్ళు ఉన్న శశి ఎక్కడికి వెళ్తుంది....ఈ కిటికీ ఇక్కడనుంచి ఎగురాలేదు. నీశశి నిన్నువిడిచి ఎక్కడికీ వెళ్ళాలేదు' అని అంతర్వాణి వినిపిస్తూండగా, కడుపునిండా నవ్వుకున్నాడు.

ఆడవాళ్ళు బయట కడుగు పెట్టాలనుకుంటే చాలు; శోభన సింగారాలు వెల్లి విరిసిపోతాయి. ఆ దొడ్డిలో సుమారుడజనులోపు అమ్మాయిలు సువాసనాలహారుల్ని వెదజల్లుతూ, ఒకటోరకం దుస్తుల్లో గువ్వల్లా ఏమిటేమిటో తెగ వాగేసు కుంటున్నారు. సినిమా మాటల్ని వంకాయల్లాకోస్తూ నవ్వులనేతిలో తాలింపెడుతూ, ఆ ప్రదేశమంతా ఘుమఘుమ లాడించేస్తున్నారు.

ఈ సినిమాముఠాకంతటికీ సావిత్రి నాయకత్వం వహిం చింది. ఆ వీధిలో దేనికైనా మరి ఆవిడే పెద్ద. అందుకనే లేడీ రామారావుకూ ఈమెకు పడదు.

రేడియో ఆర్టిస్టు, ప్లేబేక్ గాయిని అయిన మిస్ చిట్టి వసంతం, లేడీ రామారావు తరఫున ఉంటూకూడా, సావిత్రి గారింట్లో అప్పుడప్పుడు కచేరీలు చేస్తూఉంటుంది. ఇది లేడీ రామారావుకు గిట్టక పోయినా, చిట్టి వసంతాన్ని విడిచి బత కడం ఆమెకు దుర్లభమే! చిట్టి వసంతం ఎప్పుడూ తనచిన్న నోరు తెఱచి, 'లేడీ రామారావుగారూ... లేడీరామారావు గారూ...' అని పిలుస్తూంటే ఆమెకు-అంటే లేడీ రామారావు గారికి-ఈ చిట్టి వసంతం నోరు చిన్న రేడియో పెట్టెలా కని పిస్తుంది. అందులోంచి తన పేరు మధురంగా ప్రసారమౌ తూన్నట్లు ఆమెకు తోస్తుంది. అందుకనే చిట్టి వసంతాన్ని ఆమె విడిచి ఉండలేదు.

ప్రస్తుతం చిట్టి వసంతానికి తలనొప్పి హెచ్చుగా ఉండడంవల్ల ఆమె సినిమాకు రావడంలేదు. అసలు ఈవిడ గారిచేత ఇప్పుడు వీళ్ళు చూడబోతూన్న సినిమాలోని పాటలు పాడించడానికి మొదట్లో నిర్ణయం జరిగిందట. ఆ తరువాత ఎంచేతనోగాని 'ఈవిడగారి కంఠం మనల్ని వైకుంఠం చేర్చే స్తుం'దన్న రిమార్కుతో ఈమెగార్ని వాళ్ళు ఇంటికి టిక్కెట్టు పుచ్చుకోమన్నారట. అంచేత పాపం ఈచిట్టి వసంతంగారికి, ఈ సినిమా ఊసెత్తితేచాలు తలనొప్పి తరుముకొస్తూ వుంటుంది. 'ఎందుకండీ... వెధవ సినిమా... ఏమి బాగుండదట ...' అనికూడా సావిత్రితో అనేసిందట! సావిత్రి ఓ నవ్వు నవ్వేసి 'అసలుసంగతి నాకు తెలుసు చిట్టీ....'అని ఆమెవైపు అదోలా

నవ్వి, 'ఎందుకులే.... నీకంత బాధగా ఉన్నప్పుడు . . . నువ్వా సినిమా చూడకూడదు . . .' అందట.

ఇదే సావిత్రితో వచ్చిన చిక్కంతాను! ఆమె గట్టిగా బలవంతంచేస్తే చిట్టి వసంతం సినిమాకు వచ్చేసేదే... అందుకు బదులుగా సావిత్రి అలా ఎగతాళి చెయ్యడంతో చిట్టి వసంతం ఉడికిపోయింది. అసలు సావిత్రి అందరినీ ఇలాగే ఏడిపిస్తుంది. ఏడిపించడమంటే ఆమెకు బహుసరదా!

అందుకనే శశి, ఎప్పుడు హడలి పోతూ వుంటుంది. సావిత్రి ఏ రూపంలో ఎప్పుడు ఏడిపిస్తుందో అంతు చిక్కదు.

ఒకసారి శశిని ఏమి చేసిందనుకున్నారు! ఇంతకుపూర్వం ఈవీధిలో ఉండి, ఇప్పుడు మరొక వీధిలో కాపురముంటూన్న సుభద్ర ఓపిల్లవాణ్ణి కన్నది. ఆ అబ్బాయి బారసాలకు సావిత్రి, శశి ఇద్దరూ వెళ్ళలేక పోయారు. ఆ తరువాత ఇద్దరూ ఓరోజున అక్కడకు వెళ్ళడానికి ప్రోగ్రామ్ పెట్టుకున్నారు. ఆనాడు శశితో, సావిత్రి 'ఇదిగో శశీ...ఏమైనా చొక్కాగుడ్డలు అవీ... ఆ అబ్బాయికి పెట్టడానికి తీసుకొస్తున్నావేమిటి ... ఎందుకు దండుగ... నేనేమీ తీసుకురావటంలేదు' అంది.

అప్పుడు శశి, 'అదికాదండి ... ఉత్తచేతులతో వెళ్ళడం ఏమి బాగుంటుందండీ...ఎవరేనావింటేనవ్వుతారుకూడాను...' అంది.

సావిత్రి తమాషాగా నవ్వి, తన పెద్దరికం అంతా ఒలకబోస్తూ, 'చూడు శశీ...నీకింకా పసితనం వదల్లేదు. ఇలాగైతే నీకాపురం గటెక్కినట్లే. ..ఎందుకు నీకిలాంటి బాదరబందీ

అంతా. సుభద్రకు తెలియదేమిటి...అవిడేమీ అనుకోదు పద...' అంది. అలా అని తిరిగి, 'ఏమో నీయిష్టం. నేను మాత్రం ఏమీ తేదల్చుకోలేదు... నీవు తీసుకు రావాలని ఉంటే తీసుకురా...నేను వద్దనను' అంది.

శశికి సావిత్రి అర్థంకాలేదు. ఈవిడ కాళ్ళ ముందు తల బ్రద్దలు కొట్టుకున్నా, ఈమెకి అర్థం కాదు దేవుడా అనుకుంది. చచ్చినట్టు ఆమెతో ఉత్తచేతులతోనే బయలు దేరింది.

తీరా సుభద్రఇంటికి వెళ్ళేప్పటికి, సావిత్రిగారి ఇంటి నౌకరు, ఆవిడికక్కడ ఏదో పొట్లం ఒకటి అందించి ఇంటికి దారితీశాడు.

శశి నిర్ఘాంతపోయింది. అదేమిటో అర్థమౌతూన్నా.... 'ఏమిటండీ... అది...' అని అనకుండా ఉండలేక పోయింది.

సావిత్రి ఏమాత్రం మార్పుచెందకుండా ఎంతో సహజంగా...'ఈ మగవాళ్ళకేమీ మతులుండవు.. ఆయనకి నేను ప్రొద్దుట చెప్పానులే... సుభద్ర ఇంటికి వెళ్తానని. నేను ఇల్లు వదలి వెళ్ళిన తరువాత ఆయనకు గుర్తొచ్చినట్లుంది. అయినా కాని... ఇలాంటి పిచ్చిపను లెవ్వరు చెయ్యమన్నారో... సరేలే... ఈచిన్న గుడ్డముక్కా ఇంక ఇంటికెలా తీసుకెళ్తామనుకో...' అంది.

శశి గుండెలు పాపం పూర్తిగా బ్రద్దలై పోయాయి. ఆమె పేదగా నిరుపేదగా ఏడ్చింది. కళ్ళల్లో తిరిగిన నీళ్ళను. సావిత్రి ఎక్కడ చూస్తుందో అని ఓ ప్రక్కగా తిరిగి తుడిచేసుకుంది.

ఇలాగే ఉంటాయి సావిత్రిగారి వ్యవహారాలన్నీ. ఆమెకు ధనం ఉంది. ఆ ధనంతో వచ్చేవిలువ నామె ఎప్పుడూ దూరం చేసుకోదలచలేదు. ఇప్పుడు సినిమాకు బయలుదేరిన జట్టులో సగంమంది ఆమె డబ్బుతోనే సినిమా చూస్తారు. వాళ్ళంతా ఆమె అడుగులకు మడుగులొత్తుతారు. సావిత్రి కదే కావలసింది. 'నాడబ్బు మీ కోసం ఖర్చు చెయ్యనివ్వండి. కాని, నా కోసం మీ డబ్బు ఖర్చుపెట్టకండి. నా అధికారాన్ని మీ రే రూపంలోనూ తగ్గించడానికి వీల్లేదు' అంటుంది ఆమె మనసు.

అందుకనే సావిత్రి, శశి ఎన్నిసార్లు 'టీ'కి ఆహ్వానించినా ఆమె ఎప్పటికప్పుడు ఏవేవో సాకులుచెప్పి తియ్యగా ఆహ్వానాన్ని తిరస్కరించేది. కాని, శశిని తమ ఇంటికి తీసుకెళ్ళి తమ గొప్పనంతా ప్రదర్శించి ఆమెను బోలెడన్ని ఫలహారాలతో ఉక్కిరి బిక్కిరిచేసి, తినకపోతే ఎక్కడ ఏమనుకుంటుందో అన్నంత భయంలో ముంచేసి, తిన్న తరువాత ఇంతకక్కుర్తి మనిషిని ఎక్కడా చూడలేదన్నట్లుగా మొగాన్ని పెట్టేది. ఒకరోజున ఎలాగైతేనేం పట్టుపట్టి శశి, సావిత్రిని తన ఇంటికి లాక్కొచ్చింది. ఆమె కేవేవో చేసి పెట్టింది. ఆమె వాటిని మచ్చుచూసినట్లు కొద్దికొద్దిగా రుచిచూసి, 'ఓ.... నువ్వు వంట చాలాబాగా చేస్తావు శశీ...మా వంటవాడికిల్లాంటి నేర్పింటే ఎంత సంతోషించేదాన్ని' అని. "అది సరేకాని శశీ...నన్ను బ్రతికించదలచుకుంటే, ఆ మంచినీళ్ళ గ్లాసు ఇలాఉంచేసి మిగిలినవి తీసేద్దూ" అంది.

శశి మొగానకత్తి వ్రేటుకు నెత్తురు చుక్కలేకుండా పోయింది. "అదికాదండీ...కొద్దిగా నైనా తినండి...అసలు ముట్టుకోలేదు..." అని ఎంతో ఎంతో బ్రతిమాలింది.

తనను గౌరవించే పేదవాళ్ళను తక్కువగాచూసే ఆ ధనికుర్రాలు, ఆ పేదవాళ్ళకు ఏవేవో సహాయాలు చేస్తున్నట్లు కనబడాలనుకునే తత్వంగల ఆ ధర్మాత్మురాలు, అడుక్కునే వాళ్ళకు సాధారణంగా బిక్ష పెట్టడం మరచిపోతూండే ఆ పుణ్యాత్మురాలు, "ఏమిటి శశీ. . .నీ చాదస్తంగాని యివన్నీ నేను తినెయ్యాలనే...ఎక్కడైనా ఎవ్వరయినా ఇన్ని తినగలరా....నీకు మరీ కోపంగా ఉంటుందేమో...చెప్తే నమ్మవు. నాకివ్వాళ అసలు ఆకలిగాలేదు. నీతృప్తికోసం ఈ కాస్తాతింటాలే...నన్ను మరీ బలవంత పెట్టకు. బాబ్బాబు...నీకు పుణ్యముంటుంది" అని ఓ చెమ్చాడు చక్కెర పొంగలి వెగటుగా తింది.

ఇక ఇలాంటి స్త్రీని, శశి ఇంకేం బలవంతపెట్టగలదు. వంటగదిలోకి వెళ్ళి పాపం గట్టిగా ఏడ్చేసింది. ఇక ఆమె అంతకన్నా ఏమి చెయ్యగలదు ?

సావిత్రి ఒకటోరకం పొడగరి! కళ్ళూ ముక్కూ తీర్చినట్లుంటాయి. ఆమెముందు ఇంతింత లేని వాళ్ళంతా, ఆమెకు దాసీత్వంచేసినా ఫరవాలేదనుకుంటారు. ఆమె చెప్పినమాట జవదాటడమనేది ఆ వీధిలోని వారికెలాగో తెలియదు. అంత మనిషిని బాధ పెట్టడమనేది, వాళ్ళెప్పుడూ సహించలేరు. అందుకనే వాళ్ళు శశి చేస్తూన్న ఈ ఆలస్యానికి ఊహించలేకపోతున్నారు.

'అబ్బ!...శశి ఉందే....ఒత్తిబిడ్డ. సర్దిందే సర్దుతుంది. ఆ ఇల్లు సర్దుకోవడంగాని, వాళ్ళాయనగారికి చెప్పడంగాని ఆమె కిప్పట్లో తెమలవు" అంది కళ్ళజోడు పంతులమ్మ.

వెంటనే వంతపాటగా, సిల్కు శరీరం తాయారు (సిల్కు వల్కలాలు తప్పించి తదితరాలు ఆమెకు గిట్టవని ఈ పేరు ఆ వాడలోని స్త్రీలోకం ఆమెకు స్థిరపరిచేసింది.) 'అది కాదో. సినిమాలో కూడా....వాళ్ళాయనగారు తలుపుగెడ వేసుకున్నారో లేదో అని—ఏమే....నువ్వు విన్నావటే...మా ఆయనగారు తలుపుగెడ వేసుకున్నట్లు...అంటుంది. వర్తిపిరికి... హి...హీ....' అని, ఆమె మొగం కనిపించని వాళ్ళకు, ఏడుపులా వినిపించే నవ్వు నవ్వింది.

అప్పుడు, బాల అనే సుందరి, 'అదికాదే వాళ్ళాయనగారు తలుపు గెడతీసుకొని, బయట కుడాయిస్తారేమో నని ఆవిడగారి భయం. అవిడ కసలు బయిట తాళం వేసెయ్యాలని ఉంటుంది. మనం లేకపోతే అంత పనిచేస్తుంది కూడాను.' అంటూ పగలబడి నవ్వింది.

అప్పుడే శశిని వెనకేసుకొద్దామని ఊహించిన, ఈ మధ్యనేపెళ్ళి చేసుకున్న క్రొంగొత్త పెళ్ళికూతురు, 'బలేగా ఉన్నాయి నీ మాటలు. మనం లేకపోతే శశి...సినిమా కెలా వెళ్తుంది...' అని ఇంతలోనే శశి అక్కడకు రావడం చూసి తను, శశితరఫున మాట్లాడాలనుకున్నమాట మఱచిపోయి 'అదిగో వచ్చింది. . . ఏమిటి. . .ఇంకా సింగారించుకోవడమే కాలేదూ ఇంకెప్పుడమా సినిమాకెళ్ళడం ఆట సగమైనతరువాతేమిటి. . .' అంది.

అప్పుడే సన్నని తీగలాఉన్న సౌదామిని హుషారుగా, 'శశి వచ్చె. . .ఒహో శశివచ్చె. . .మొదలాడూ. . .అని, ఆట ఏకబిగిని మళ్ళీ మొదలెట్టేస్తారే. . .అని చక్కని నృత్యభంగి

మేలో నిల్చి, 'ఉ' అంటే, ఆ స్థలం నృత్యశాల చేసెయ్యడానికి సిద్ధంగా చేయెత్తింది.

ఈ విధంగా ఆ స్త్రీ లోకమంతా శశి చుట్టూమూగే సరికి, సావిత్రి గట్టిగా ఆ ప్రదేశమంతా నిశ్శబ్దానికి మారు పేరైపోయేట్లు, 'మీరుండండి' అనిగదిమి, 'ఏమిటి శశీ. . . ఇంతకీనువ్వు వచ్చేట్లారానట్లా. . .ఇలా మమల్నిక్కడ ఎంత సేపు నిలబెడతావు?' అంది.

శశికి తలతిరిగింది. ఈ పరిస్థితిలో అందులో ఇంతవరకు, ఇందరికింత శ్రమఇచ్చిన తను—ఇప్పుడు సినిమాకు రాననడం ఎలా? ఎలా? అనుకుంది. గుండెల్లో హడలిపోయింది. రేపొద్దున్న ఇందరిముందు బ్రతకడం ఇంపాసిబుల్ అనుకుంది. అందులో సావిత్రిగారు నిలబడ్డారు కూడాను!

గబాలున, 'ఇదిగోనండి. . .ఇప్పుడే వచ్చేస్తున్నా ఒక్క నిమిషం. . .' అని తిరిగి లోనికి తలకించిత్తూ ఎత్తకుండానే వెళ్ళిపోయింది. అప్పుడే పెద్దనవ్వుల డప్పొకటి ఆమె వెనుక టుప్న పగిలిపోయింది. శశిగుండె ఆమె మెదడులో కొట్టుకుంది. తలను గొాట్టపాటేలు ఢీ కొన్నట్లు తలపోటు విజృంభించింది. 'అమ్మో. . .ఇప్పుడేలాఈయనకు చెప్పడం. . .ఎలా. . . అనుకుంది. సిగ్గుపడిపోతూ, అభిమానపడిపోతూ, వస్తూన్న రోషాన్ని చిందర వందరచేసేస్తూ, అతనున్న గదిలోకి వెళ్ళేప్పటికి పూర్తిగా కళ్ళనీళ్ళ పర్యంతం అయిపోయింది.

ఇక ఆ గదిలో రామం, శశి సినిమాకు వెళ్ళడంమానుకుంది గదా అని ముసిముసి నవ్వులతో కూనిరాగానికి తన మనస్సు సర్పించాడు. అతని చేతులూ కాళ్ళూ. . .వాటితో

అతని తల ఆ రాగాని కనుగుణంగా మేజిక్ బొమ్మలా తాళం వేస్తూ ఆడుతున్నాయి. ఈ ఆట చూడగనే శశిగుండె నీరై పోయింది. 'అమ్మో...ఇప్పుడు వీరికేమి చెప్పాలి. ఎలా చెప్పాలి...ఎలా చెప్పాలి?' అని తిరిగి అనుకుంది. కాని ఏమి చేస్తుంది. ఆ సావిత్రిగారితో 'ఇప్పుడే వస్తా'నని చెప్పి మరీ వచ్చిందాయె అమ్మోం... వెళ్ళకపోతే ఇంకేమైనా ఉందా... ఫరవాలేదు...రామాని కెలాగో ఓలాగ చెప్పేసెయ్... ఏమీ అనుకోడు' అని అనుకుంటూనే ఆపుకోలేని ఉద్వేగంతో 'నన్ను పోనివ్వండి...'అని చంటిపిల్లలా ఏడ్చేసింది. రామం ఒకసారి నివ్వెరపోయాడు.

"అదేమిటి శశీ...ఇప్పుడేగా వెళ్ళనన్నావ్" అన్నాడు.

కాని శశి అతని మాటలు వినిపించుకోలేదు. అప్పుడా మెకు ఏడ్చినందువల్ల కాబోలు విపరీతమైనకోపం వచ్చేసింది. 'వెళ్తానండి' అని విసురుగా అనేసి, బయట తనకోసం ఎంత మంది నిలుచుండిపోయారో అని బాధపడిపోతూ, అమ్మోం... సావిత్రి ఎంత విసుక్కుంటుండో అని భయపడిపోతూ గబగబా చీర మార్చేసుకొని, ఒక్కసారికూడా మొగం అద్దంలో చూసుకోకుండానే తలుపుతీసి, "పదండి..." అంది.

పాపం బయట ఆ సి ని మా జ న ం ఉన్నారనుకుంది కాబోలు! అప్పటికే ఆ పటాలం తాలూకు మార్చింగ్ సాంగ్ ఆ వీధిచివర గోలగా సాగిపోతోంది. పాపం శశి రైలుచక్రాల క్రింద నలిగిపోతూన్న దానిలా అయిపోయింది. అక్కడే అలాగే కూలిపోయింది.

అప్పుడే ఆమె తలలో సావిత్రి మెరిసి, "మేం వెళ్ళిపోయా మని నువ్వేమీ అనుకోకు శశీ ...ఏంచేస్తాం...ఒక్కొక్కరికి అలాంటి భర్తలు దొరుకుతారు! వాళ్ళను కట్టుకున్నందులకు బాధపడి ఏమి ఫలితం...." అని కనిపించీ కనిపించని నవ్వు నవ్వి నట్లయింది. శశి ఆ గుమ్మందగ్గరే ఉండిపోవడం చూసిన రామం, మెల్లిగా ఆమెదగ్గఱకు వెళ్ళి, "పోనీ...మనం వెళ్దాం పద శశీ...ఈ సొసైటీలో మెలగడం నీలాంటి నాలాంటి వాళ్ళకు చేతకాదు. అన్నింటినీ-మనల్ని కాదన్నట్లు తుడిచేసు కుంటూవుండాలి. అప్పుడే మనం..." అని ఇంకా అతనేమే మిటో అనబోతున్నాడు. కాని, శశి అదేమీ వినిపించుకోకుండా గబగబా తన గదిలోకి వెళ్ళి తలుపు గట్టిగా బిగించేసుకుంది.

పాపం ఇక రామం ఏమిచేస్తాడు...'ఎంతపనిచేసింది శశి....' అనుకుంటూ, ఆ గదిలోపలినుంచి ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూన్న ధ్వని తరంగాలు జాలిగా బయటికి కదిలివస్తూన్న సంగతినిగుర్తించి 'అయ్యో....ఈ రాత్రి ఎంత చెడ్డది!' అని నిట్టూర్చాడు.

## 2

అప్పటినుంచీ శశి సావిత్రితో మాట్లాడటం మానే సింది. ఆమెతో మాట్లాడటం మానేసిన దగ్గఱనుంచీ శశి మన సులో సుఖంగా ఉండటంలేదు.

అసలు ఆ మరునాడే సావిత్రి, ఆరాత్రి శశి ఎలా ఊహించిందో సరిగ్గా అలాగే తమాషగా చెప్పింది. 'మేం వెళ్ళి

పోయామని నువ్వేమీ అనుకోకు శశీ ... మీ ఆయన నిన్నెంత బాధ పెడుతున్నాడో ప్రత్యక్షంగా చూసికూడా, ఇంకా నీకు బాధకలిగించడం నాకు ఇష్టం లేకపోయింది. ఏమి చేస్తాం! అటువంటి భర్తలు ఒక్కొక్కరికి దొరుకుతూ వుంటారు. మరి వారినెలా తోసెయ్యగలం చెప్పు. అలాంటివారిని సంతోషంతో స్వీకరించవలసిందే' అంది.

శశి మండి పోయింది. కాని ఆసమయంలో ఏమీ మాట్లాడలేక పోయింది. ఆమె అప్పుడు ఎన్నో మాటలనాలని ఎంతగానో ఆలోచించింది. కాని ఒక్కటీ అనలేక పోయింది. మెల్లిగా, 'లేదండి.... ఆయన వెళ్ళమన్నారు' అంది దాచుకోవాలనుకున్నా దాగని ఉద్వేగంతో.

అప్పుడు సావిత్రి, ఈ ప్రపంచంలోని నవ్వు నంతా గుత్తకు తీసుకున్నట్లు, పకపక ప్రవాహంగా నవ్వి, గుక్క తిప్పుకొని, 'నాకు తెలుసు శశీ .. నువ్వు మంచిదానవు. నేనదే కోరుతాను' అంది.

శశి ఇంకేమీ మాట్లాడ లేక పోయింది. అప్పుడు సావిత్రి, 'పిచ్చిపిల్లా ... 'అంటూ శశి బుగ్గమీదపొడిచి వెళ్ళిపోయింది.

ఇలాంటిమనిషితో విరోధం తెచ్చుకోవడం ఎలాగో శశికి బోధపడలేదు. కాని శశి తెగించి సావిత్రి ఇంటికి వెళ్ళడం మానేసింది. సావిత్రి పిలిచినా వెళ్ళలేదు. వాళ్ళూ వీళ్ళూ అనుకున్న మాటలనుబట్టి సావిత్రి నవ్వుకున్నదని శశికి తెలిసింది. సావిత్రిమీద కోపాన్ని శశి మరింత రగిలించుకుంది.

శశి ఎప్పుడైతే సావిత్రితో విరోధం పెట్టుకుందో, అప్పటినుంచీ లేడీ రామారావుకు ప్రాణం లేచి వచ్చినట్లయింది.

తనబలం ఇప్పుడు కొంచెం వృద్ధి చెందుతుందని అమెఅనుకుంది. శశి పిలువక పోయినా ఎక్కువగా శశి దగ్గరకొచ్చి, బాతా ఖానీ వేస్తూ ఏవేవో కబుర్లుచెబుతూ, శశిని ఎక్కువగా తన ఇంటికి అహ్వానిస్తోంది. శశి ఇక ఎవ్వరింటికీ వెళ్ళకూడదనుకుంది. కాని మరీ అన్ని సార్లు లేడీ రామారావు బ్రతిమాలి పిలుస్తూంటే వెళ్ళకపోతే బాగుండదని, అప్పుడప్పుడు లేడీ రామారావు ఇంటికి వెళ్ళివస్తోంది. ఈవిధంగానైనా సావిత్రిని వేడిపించవచ్చని కొంత సంతోషించింది.

రోజులు గబగబా నడుస్తున్నాయి. ఆరోజు ఆదివారం. రామం ఎంతో హుషారుగా ఉన్నాడు. 'శశీ శశీ మన మిద్దాళ సినిమాకు వెళ్దాం....నువ్వు త్వర త్వరగా తయారైపోవాలి. లేకపోతే ఆవేళ సావిత్రి చేసినట్లే చేస్తాను.' అన్నాడు కళ్ళల్లో నవ్వును నిలేసి.

శశి వస్తూన్న నవ్వును పాటలా సాగదీస్తూ, 'అసలు మీతో సినిమాకొచ్చేవాళ్ళుకూడా ఉంటా రనుకున్నా రేమిటి?' అంటూ వంట గదిలోకి వెళ్ళిపోయింది.

రామం తిన్నగా ఆమె వెనకాలే వెళ్ళి 'ఏమమ్మాః... ఎందుకు రావూ నేనంటే అంత కంటకమా' అన్నాడు.

శశి,ఆనందాన్ని మాటలకు చీరగాచుట్టి,'సినిమాలేదు... గినిమాలేదు ఊరుకోండి తియ్యగా ఏమైనా కబుర్లు చెప్పండి వింటాను' అంది.

రామం ఉబ్బి తబ్బిబ్బై పోయాడు.

'అయితే నీకేలాంటి మాటలు తియ్యగా ఉంటాయో ఈ నా చెవిని వేస్తావూః... ఓ నా చిన్నారి పొన్నారి చిట్టి శశీ' అన్నాడు.

వెంటనే శశి, 'చిట్టి, పొట్టి అనకండి. నా కసహ్యం వేస్తుంది' అంది.

ఉషారుగా రామం ఏదో సాధించినట్లుగా 'అయితే చిట్టి వసంతంకూడా రావడం లేదేమిటి శశీ! ఆ పిల్లను పాపం నువ్వేమి చేశావు?' అన్నాడు.

"ఆ పిల్ల రాకపోవడం యేమిటి... బోలెడన్ని సార్లు వస్తోంది" అంది సూటిగా.

"అయితే ఏమంటుంది శశీ...ఆ పిల్ల సావిత్రిగారిదగ్గరకు వెళ్తూవుంటుందిగా...అక్కడికబుర్లుమన కేమీ అందజేయ్యడం లేదూ..." అన్నాడు కుతూహలం మెరసిపోయే కళ్ళతో, విశేషాలను రాబట్టాలనే వాంఛలతో.

వెంటనే శశి "ఎవరిక్కావాలి...ఆ సావిత్రిసంగతి... ఒకరు చెప్పినా నాకక్కరలేదు... నాక్కావాలని నేనొకర్ని అడగనూ అడగను."

"అలాగనకు శశీ... నాకేమిటో ఆసావిత్రి మంచిది లాగే కనిపిస్తోంది. ఆమాత్రం గర్వం ఉన్నంత మాత్రంలో మనిషి చెడ్డది కాదనే నా అభిప్రాయం" అని మెత్తగా ఓ చురక తగిలించాడు.

దీనితో శశి కుతకుత ఉడికిపోయింది. ఆమె ముక్కు అసలే అందమైంది. ఈ కోపంతో అది మరింత అందమై పోయింది. "ఏమిటన్నారూ...ఏమిటన్నారూ... సావిత్రి మంచిదా! ఏమొగంతో అంటున్నారండి. మీకు కూడా రెండు నాలుక లెప్పటినుంచి పుట్టుకొచ్చాయి? నీలాంటి నాలాంటి వాళ్ళు ఈ సొసైటీలో బ్రతకడం కష్టం శశీ...అని మీరేగా అన్నారు!

అప్పుడే మరచిపోయారూ? మిమ్మల్ని గాని వాళ్ళింటికి ఆహ్వానించిందా ఏం? ఆవిడ తరఫున మహా జోరుగా మాట్లాడుతున్నారు. మనకి పిలవడమే తరువాయి...వెళ్ళి వాలాలని ఉంటుంది. ఎప్పుడు ఎవరేమి పెడతారా ఎప్పుడు నోరు తియ్యబడుతుందాఁ...అని చూస్తాం"...అంది ఏకబిగిని.

రామం ఒక్కసారి 'ఓహో' అనుకున్నాడు. "అదేమిటి శశీ...అప్పుడే అన్ని మాటలనేశావ్. నువ్విన్ని చేస్తున్నావు కదాఁ... నే నేనాడైనా, మళ్ళీమళ్ళీ కావాలని ఎప్పుడైనా ఒక్కసారైనా అడిగానా చెప్పు. ఎప్పుడు చూసినా ఇంకొంచెం తినండీ...ఇంకొంచెం తినండీ....అని నువ్వేగా చంపేస్తావు. అప్పుడు తినమని అలాగ చంపి, ఇప్పుడిలా అంటావా...ఇదేనా నీ పెద్దమనిషి తరహాఁ...నువ్వాయిపోయావు గాని మరొకరైతేనా ఏమని అని ఉండేవాణ్ణో తెలుసా?" అన్నాడు.

శశి మనసు ఈ మాటలతో ఏమిటో పరిపరి విధాలుగా పోయింది. వెంటనే ఆమె మల్లెపువ్వులానవ్వి, "అబ్బ! చిన్న మాటకూడా పడరండీ...ఇక లెండి భోజనానికి. అయినా ఇక మిమ్మల్ని బతిమాలితే అలాగనండి. మీరెలా అడక్కుండా ఉంటారో చూస్తాగా. ఇంకొంచెం ఇంకొంచెం...అంటే, వద్దు ...వద్దు...అనడంకూడా గొప్పే అనుకుంటున్నారు కాబోలు. ఎవరికి తెలియదూఁ మీ ఆంతర్యం. వద్దు వద్దంటూనే తినాలనే సుగుణం" అంది.

రామం ఉడుకుబోతు తనంగా మొగం తిప్పినట్లు తిప్పి, "అను అను...నీ మాటలు పడటానికేగా నేనున్నాను. ఇంతకీ కట్టుకున్న తరువాత పడక తప్పుతుందేమిటి. ఎంత నోచుకున్న అయ్యకి అంత ఫలితం" అన్నాడు

వెంటనే శశి, "ఛీ....అవేం మాటలండీ... ఆడవాళ్ళ
లాగ" అంటూ కిలకిల నవ్వింది.

దానికి జవాబుగా రామం, "అవును శశీ...మరచిపో
యాను. ఆడాళ్ళకు, ఆడాళ్ళంటే విలువుండదుగా" అని, "పెట్టు
పెట్టు భోజనం. దండిగా ఆకలి మండిపోతూంది" అంటూ ఎంతో
ఉల్లాసంగా అక్కడనుంచి కదిలాడు.

అప్పటికి రాత్రి ఎనిమిదయింది. దంపతు లిద్దరూ తీరు
బడిగా భోజనం అయినమీాదట ఒకరి కెదురుగా ఒకరు
కూర్చొని తమలపాకులు సేవించటం మొదలు పెట్టారు. ఒకరి
కళ్ళల్లోకి ఒకరు చూసుకొని అదేమిటోగాని విచిత్రంగా ఓ
నవ్వు నవ్వుతున్నారు. అప్పుడు రామం, "అయితే శశీ....నిన్నొ
కటి ప్రశ్నిస్తాను. సరిగ్గా సమాధానం చెప్పతావూ" అన్నాడు.

"ఓహోఁ....సరిగ్గా చెప్పకపోవడమేమిటి... మహ
భేషుగ్గా చెప్పతాను" అంది సినిమా నటన నటిస్తూ.

"బాగా ఆలోచించి చెప్పాలి తెలుసా...నోటికెలా
వస్తే అలా వాగెయ్యకూడదు" అన్నాడు లెక్చరర్ రామం.

వెంటనే శశి, "ఎలాగ వాగుతానో మీారే చూస్తా
రుగా...ముందు అడగండి మరి...తరువాత సంగతి తరువాత
చూద్దాం" అంది.

రామం తిన్నగా రంగంలోకి దిగిపోతూ, "అయితే చెప్పు
శశీ...చూద్దాం....నిష్పాక్షికంగా చెప్పాలి. విరోధముంటే విరో
ధంలా ఉంచుకోవాలి స్నేహంవుంటే స్నేహంలా ఉంచుకోవాలి.
తెలుసా? ఇవి నీ సమాధానాలమీాద ప్రభావం చూపితే...నువ్వు

డింకే కొట్టినట్లే . . .ఏం ఇక చెప్పు. . .నీకు సావిత్రి, లేడీ రామా రావుగార్లలో కనిపించిన మంచీ . . .చెడూ సూక్ష్మంగా నాలు గైదు మాటల్లో తేల్చి చెప్పు చూద్దాం . . .” అన్నాడు.

రామం ఈప్రశ్న వేయగానే శశి, ‘ఏమిటీ’ అన్నట్లు . . . ‘నాకు తెలిసింది . . .నాకు తెలిసింది . . .’ అన్నట్లు, మొగం ఆన్సరు పేపరు చేసుకొని, ‘మీకు సావిత్రిమీద అభిమాన మున్నట్లుందే? . . .’ అంది.

వెంటనే రామం, ‘నీకు లేడీ రామారావుమీద ప్రేమ ఉందేమిటి . . . చెప్పాలని ఉంటే సమాధానం చెప్పు . . .లేక పోతే మానెయ్ . . . అడ్డదిడ్డంగా మాత్రం మాట్లాడకు . . .’ అని మొగం చప్పన అధికార స్వరంలా, గంభీరం చేసు కున్నాడు.

‘అయితే ఇక చెపుతా వినండి . . .’ అని శశి ఎగతాళిగా నవ్వి, కంఠం సరిచేసుకొని, ‘ ఈ సావిత్రిగారుందే . . .ఆవిడ గారికి, ఈ వీధిలోని స్త్రీజన మంతా వ ట్టా దా స దా సీ జనంలా కనిపిస్తారు. తెలివితేటలన్నీ ఆవిడగారి సొమ్ములా ఆవిడ మాట్లాడుతారు. ఇక దేవుడు మేలుచేస్తే మరేమిటమ్మా . . .ఆc. . .నాయకత్వలక్షణాన్నీ తనలోమూర్తీభవించినవని. . . కాదు. . .కాదు. . .ఘనీభవించినవని ఆవిడగారు ఎంతోఎంతో తలపోస్తారు. ఇంకామరేమిటండీ వెధవది చటుక్కున గుర్తుకు రావు. . .ఆc అన్నట్లు. . .ఆవిడగారికి హమేషా భట్రాజు పొగ డ్తలు లేకపోతే ప్రాణం నిలుస్తుం దన్నది నిజంకాదు. ఆమీ దట ఆవిడ పాటలంటే చెవికోసుకోదు. చదువుకున్న వారిని చూస్తే మురిసిపోదు. వయసు, అనుభవం, తనకున్న ఆస్తి

అంటుంది. తనడబ్బు ఇతరులకు ధారపోసేసేదానిలా చక్కగా నటిస్తుంది. ఆమె పొడుగుకుతగ్గ శరీరం గలది. తియ్యదనానికి రూపాన్నిచ్చే మాట, ఇతరుల్ని వెక్కిరించేందుకు పేరుమోసిన ఒకటోరకం కళ్ళు, మాలాంటివాళ్ళం చూస్తేనే భయపడేంత జబర్దస్తీ ఒళ్ళు...ఆవిడ స్వరూపం...' అంటూ ఒకే నవ్వుగా ఆగిపోయింది.

వెంటనే రామం, 'బాగుంది శశీ... చాలాబాగుంది. ఇక మీ ముద్దుల లేడీ రామారావు గురించి వీనుల విందుగా వినిపించు. రికార్డులా ఆలాపించు' అన్నాడు.

శశి, ఉడికిపోతున్నారా అన్నట్టు తమాషాగా నవ్వి, 'లేడీ రామారావు మంచిది. హృదయమున్న మనిషి. ఎవ్వరినీ ఎత్తాగళి చెయ్యదు. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నదానిలా కనిపిస్తుంది. వేషం అంటే కొంచెం మక్కువ. క్లబులైఫ్ అంటే ప్రాణం. మగవాళ్ళతో తిరగడమంటే మోజు. అలాగని ఆమె అంటే గిట్టనివాళ్ళు లేనిపోనిపేర్లు పెట్టడం సహించవలసిన విషయం కాదు. అన్నివిధాల లేడీరామారావు, అగ్నిహోత్రం లాంటి మనిషి. మరి...' అని శశి ఇంకా ఎమేమో చెప్పబోతుండగా, వీధి తలుపు దడదడలాడింది.

రామం, 'ఎవరూ...' అంటూ వెళ్ళి తలుపు తీశాడు. లేడీ రామారావుగారి భర్తయిన రామారావుగారా గదిలో ప్రవేశించారు.

ఆగదిలో అడుగుపెట్టిన రామారావుగారి మొగం వేలబడిపోయి ఉంది. మొగం నిండా ప్రేతకళ తాండవిస్తోంది. అతను ఏదో మాట్లాడాలనుకొని, మాట పెగలక తొట్రుపడిన

గొంతుక సవరించుకుంటూ, ‘అయితే మీకు తెలిసిందేమిటండి...’ అన్నాడు.

శశి, రామం, ఇద్దరూ తెల్లబోయారు. వారి లేత గుండెలు దడదడ కొట్టుకున్నాయి. ఒకసారి వారిద్దరూ ‘ఏమిటండి తెలియడం...’ అన్నారు.

‘ఇప్పుడేగా... మీరు, మా ఆవిడ అగ్నిహోత్రంలాంటి మనిషని అనుకుంటూన్నారు.’ అని అతను కొంచెంసేపు ఆగిపోయి, ఆ దంపతు లిద్దఱి కళ్ళల్లోకి బాధగాచూసి, ‘మీరే ఉద్దేశంతో అనుకుంటున్నారోగాని, ఆముక్క మీరు ఎగతాళిగా అన్నట్లయితే, ఆవిడ పట్ల నిజం చెప్పినట్లవుతుందండి’ అన్నాడు.

వెంటనే రామం, ‘ఏమిటండి...అదేమిటండి...మీరు తప్పుగా అంటున్నారండి...మా శశి, తన హృదయంతో విశ్వసించి అన్న మాటండి అది...అంత సహృదయంగల స్త్రీని తా నింతవరకు చూడలేదని చెపుతూంది.’ అన్నాడు.

పాపం రామారావుగారు ఈ మాటలు వింటూ ఒకసారి మూర్ఛ పర్యంతమూ అయిపోయాడు. ‘రామంగారూ మీరు మంచివారు కాబట్టి, అలా అంటున్నారండి. కాని ఆవిడమీద నాకు మొదటినుంచీ సదభిప్రాయంలేదు. ఎప్పుడో ఒకప్పుడు ఇలాంటి పనిచేస్తుందని అనుకుంటూనే ఉండేవాణ్ణి. ఇందాక మా కుర్రాడొచ్చి మా అవిడ ఇక్కడికొచ్చిందేమో నని అడిగి ఉండడం మీరు మరచిపోయి ఉండరనుకుంటాను. మీ ఇంటికి రాక మా ఇంటిదగ్గరా ఉండక ఎక్కడికి వెళ్తుందనుకున్నాను. క్లబ్బులో ఎనిమిదిదాటి ఎప్పుడు ఉండేదికాదు. కలక్టరు

గారి భార్యతో మాట్లాడుతూ కూర్చుండి పోయిందేమో అనుకున్నాను. తొమ్మిదివరకూ చూశాను. మొదటాట సినిమాకు వెళ్ళిందేమో అనుకుందామంటే, క్లబ్బులో ఏడింటికి నేను చూశాను. నాతో సినిమా ప్రోగ్రామ్ ఉన్నట్లు చెప్పలేదు. అయినా ఎందుకైనా మంచిదని మా కుర్రాణ్ణి, అర్జంటు పనిమీద నేను బయలుదేరుతూన్నట్లు చెప్పి ఆమెను తీసుకరమ్మని అన్ని సినిమాల దగ్గరకూ పంపాను. వాడు ఎక్కడా లేరండి అన్నాడు. నా అనుమానం గట్టిపడింది. ఇక ఆ కుర్రవాడు మా ఇంటిదగ్గర ఉండటం సహించలేకపోయాను. వాడిని ఇంటికి పొమ్మన్నాను. ఆ తరువాత నాకేమిటో క్లబ్బుదగ్గరకు వెళ్ళి చూడాలనిపించింది. మెల్లిగా అక్కడకు బయలుదేరాను. ఎంతో గార్డెడ్ (Guarded) గా అక్కడి ప్యూనును ప్రశ్నించాను. ఎనిమిదింటికే రిక్షామీద వెళ్ళిపోయారని వాడు చెప్పాడు. దీనితో నా ప్రాణం విలవిల తన్నుకుంది. చావు రాదేమి భగవంతుడా అనుకున్నాను. బయట రిక్షా వాళ్ళిద్దరు కనిపిస్తే వాళ్ళను వాకబు చేశాను. వాళ్ళల్లో ఒకడు, ఎనిమిదింటికో అమ్మాయిగారు నా రిక్షాలో వచ్చారండి. వచ్చివచ్చి సగం త్రోవలోనే ఆ తూము దగ్గర ఆగిపోయారండి. ఇంతలోనే ఓ కారువస్తే ఆకారులో వారెక్కి-పోయారండి. ఆ కారాయనే నాకు డబ్బులిచ్చారండి. అంటూ చెప్పాడు. నాకంతా అర్థమైపోయింది. ఆ ఏట్లోపడి చావాలనిపించింది. కాని అలా చేయలేక పోయాను.

'రామంగారూ...నా నరాలు పటుత్వం తప్పుతున్నాయండి. మీరు శ్రమ అనుకోకపోతే కాస్సేపు మా ఇంటిదగ్గర కూర్చుందురుగాని రండి. నా కెలాంటిగతి పట్టింది. నేనేం

పాపం చేశానని ఇంత అవమానం నానెత్తిని రుద్ది పోయింది.' అంటూ ఆయన కుమిలి కుమిలి ఏడ్చాడు.

'నాలో రక్తం విరిగి ముక్కలై పోతోంది. నా మతి పోతోంది. ఆమె ఈ రాత్రి నిజంగా ఇంటికివస్తే, ఏమి చెయ్యాలంటారు ... మీరు చెప్పండి ... రామంగారూ. ఆ కులట నేమి చెయ్యాలంటారు... నేను సహించలేనుఈ బాధ. ఈ బాధ భరించి ఎలా బ్రతగ్గలను ? ప్రపంచంలో ఎప్పుడైనా ఎవ్వరికైనా ఇంత కష్ట మొచ్చిందాండి రామంగారూ ...' అంటూ విలవిల తన్నుకున్నాడు.

పాపం రామానికి కా క్షణంలో ఏమి మాట్లాడాలో తోచలేదు. శశి చిత్తరువులా ఆ రామారావుగారి వైపు చూస్తూ అలాగే ఉండిపోయింది.

మెల్లిగా రామం ఎలాగో వీలుచేసుకొని, "మీ రన వసరంగా అపోహ పడుతున్నా రనుకుంటానండి. ఆ రిక్షాలో ఎక్కినావిడ మీ వా రేనని ఎందుకనుకోవాలి. మరొకరు కాగూడదూ. ఇంతకి వారెక్కడికైనా స్నేహితులు బలవంతంచేస్తే వెళ్ళి ఉండవచ్చు, మీ రనవసరంగా లేనిపోని కలతలు పెట్టుకొని మనసు పాడుచేసుకుంటున్నారు. మీ ఇంటిదగ్గర కూర్చుందాం పదండి. శశీ...తలుపు వేసుకో" అంటూ రామం, రామారావుగారిని తీసుకొని ఎదురుగా ఉన్న వారింటికి బయలు దేరాడు.

రామారావుగారు ఆ ఇంటికి చేరుకునేలోగానే గుండె ఆగి చచ్చిపోతారేమో అన్నట్లుగా అయిపోయారు. 'రామం గారూ....మీరు మిత్రులు కాబట్టి అలా చెప్తున్నారు కాని

ఇన్ని విషయాలు కలవడమనేది అసాధారణమండి...ఆమె ఇంటి దగ్గర లేకపోవడం, అవతల ఎనిమిది గంటలకే క్లబ్బు విడిచి పెట్టడం.... ఏమిటంటారు? ఆమె ఎక్కడికీ వెళ్ళకపోతే ఇంట్లోనే ఉండాలిగా... అక్కడ బయలుదేరింది. కాని ఇంటికి మాత్రం చేరడం జరగలేదు. ఇంక ఏమనుకోవాలి. మీరే చెప్పండి....' అన్నాడు.

రామం ఆయన్ని ఓదారుస్తూ, 'మీరు ఎక్కువగా ఆలోచిస్తున్నారండీ...నా కింకా నమ్మకం, అందులో మా శశి అందరినీ చక్కగా జడ్జి (Judge) చేస్తుంది. మీ వెనుక మేం అనుకునే మాటలకు అసలు ఎప్పుడూ నిజమైన విలువ ఉంటుంది కదా! మా శశి, ఆవిడ అగ్నిహోత్రం లాంటిదని చెప్పినప్పుడు నాకు చాలా ఆనంద మయిందండీ. మీరు నిశ్చింతగా ఉండండి. తెల్లారేప్పటికి అన్నీ రైటైపోతాయి. ఆమె ఎవరో స్నేహితులు, బలవంతంచేస్తే వారి ఇంట్లో ఉండిపోయి ఉంటారు. అంతకన్నా ఏమీ అయిఉండదు.' అన్నాడు.

రామారావుగారు, రామం కళ్ళల్లోకి, 'అలాజరగాలనే నేనూ కోరుకుంటున్నానండి...అదే నేను వాంఛిస్తున్నాను' అన్నట్లుగాచూసి, 'మీరు నా ప్రక్కను కూర్చుంటే నామనస్సు కెంతో శాంతిగా ఉందండి...నా హృదయాని కేమిటో మీ సమక్షంలో తేలికగా ఉందండి. ఇలా ఎందుకు జరిగిందో నా కర్థం కావడంలేదు. మనిషి ఎంతమంచిదనుకున్నారు...అందుకనే నేను ఆశ్చర్యపోతున్నాను. అందులో నేనెప్పుడూ ఆమెను చిన్న మెత్తుమాట కూడా అనలేదు. ఆమెకోరికలు ఎటువంటివైనా క్షణాలమీద తీర్చాను, నా పంచప్రాణాలు ఎప్పుడూ ఆమెమీదే ఉంటాయి" అంటూ ఆగిపోయాడు.

మెల్లిగా రామం, 'ఔనండి, మాకు తెలుసుగా మీ అన్యోన్యత. ప్రపంచంలో పురుషునికున్న సంతోషమంతా... స్త్రీయే కదాండి. ఆమెమీద అతడెన్నో ఆశలు పెట్టుకుంటాడు. ఆమె తనప్రేమతో తనను పులకితం చేయాలని కోరుకుంటాడు. రత్నాలవంటి పాపల్ని ప్రసాదించి తన ఆత్మానందానికి మెరుగులు దిద్దాలని ఎంతో వాంఛిస్తాడు. అటువంటి స్త్రీ-తను ఎంతో నమ్మి, తనఆశల్ని, తన ఆనందాన్ని, తన హృదయాన్ని, తనసమస్తాన్నీ ఆమె కంకితం చేసేసి తనే ఆమెగా బ్రతుకుతూన్నప్పుడు-ఆమె అన్యాయం తలపెడితే, ఇంక అంతకన్నా ఘోరం మరేం ఉంటుంది? నిజంగా ఇది సహించలేని విషయమే. కాని సహనమే కదాండి మానవుణ్ణి ఉన్నత పథాలలో నడిపించేది. మనం ఇంకొంచెం ఓపికపట్టి, ఎదురుచూడటంవల్ల అన్ని చీకటులూ బాధలూ కరిగిపోయి వెలుతురులు మన కళ్ళముందు ప్రత్యక్షంకావచ్చు. ఇలాంటి విషయాలలో తొందరపాటు కూడదండీ" ... ... అని రామం, నిశ్చలంగా, మృదువుగా చెబుతూంటే రామారావుగారి బాధ కొంత తగ్గినట్లయింది.

"ఈ రాత్రికి మీరిక్కడే ఉండండి... నా మనస్సుకు బలంగా ఉంటుంది. ఈ విషయములో మీరు నాకీ సహాయం చేసిపెట్టాలి." అని ఏంతో ప్రార్థేయపూర్వకంగా అతను రామాన్ని రిక్వెస్టు (Request) చేశాడు.

రామం, "అలాగేనండి... తప్పకుండా ఉంటాను ఒక్క నిముషంలో శశికి చెప్పేసివస్తాను" అంటూ ఇంటికి బయలుదేరాడు.

రామారావుగారితో కలిసి రామం వెళ్ళగానే శశి ఏదో అర్థంకాని లోకంలో తిరుగుతున్న దానిలా మెల్లిగావచ్చి తలుపు గెడ వేయబోయింది. బయట అంతా గాఢాంధ కారంగా ఉంది. ఆకసంలోచుక్కలు మాకు ఆధారం ఏమిఉంది. ఏక్షణాన రాలిపోతామో ఏమో ...అని ఎంతో బితుకు బితుకు మంటున్నట్లు మిణుకు మిణుకుమంటున్నాయి. శశి గుండెల్లో తెలిసీ తెలియని భయం ప్రవేశించింది. చప్పున ఆమె తలుపు వేసేసుకుంది. అప్పుడే ఆ తలుపు ఎవరో కొట్టిన చప్పుడైంది. ఆ తలుపు చాలా మెల్లిగా తట్టబడింది. పిలుస్తు న్నారా లేదా అన్నట్లుగా కంఠం వినబడింది. శశి వణికి పోయింది. భయం భయంగా 'ఎవరూ?' అంది. బయట అలి కిడి లేదు. కాస్సేపు అంతా నిశ్శబ్దం. తిరిగి తలుపు చప్పుడైంది. శశి గజగజలాడిపోయింది. తలుపుదగ్గరకు వెళ్ళింది. 'ఎవరండి మీరూ?' అంది.

ఓ కంఠం 'నేనుశశీ తలుపుతీయ్' అంది. వెంటనే శశి, 'ఆఁ...లేడీ రామారావుగారా' అంటూ గబగబా తలుపు తీసింది. లేడీరామారావు చప్పున లోనికి వచ్చేసి, తలుపు రెక్కలు రెండూ వెంటనే మూసేసి, శశి నోటిమీద చేయి పెట్టి, "గట్టిగా మాట్లాడకు శశీ" అంది.

శశి తల ఒక ముద్దలా అయిపోయింది. ఆమె కేమీ తోచలేదు. 'ఎక్కడనుంచి వస్తున్నారు ?' అంది. పాపం లేడీ రామారావుగారి కళ్ళవెంట నిశ్శబ్దంగా జారుతున్న ఆ కన్నీ ళ్ళను చూడలేక పోయింది. గదిలో విద్యుద్దీపం తన కిరణ పుంజాలతో ఒకసారి మృదువుగా ఇద్దరి తలలనూ నిమిరింది. లేడీ రామారావు నోటికి చీరచెంగు అడ్డుగా పెట్టుకొని,

దుర్భరమైన బాధను లోలోపలే అణచుకుంటూ ఏడ్చింది. 'చెప్పండి లేడీరామారావుగారూ...అసలు ఏమి జరిగింది' అంది యెలాగో ధైర్యం తెచ్చుకొని శశి.

కాని లేడీ రామారావు ఏమీ మాట్లాడలేక పోయింది. ఆ గదిలో నిశ్శబ్దం విలపిస్తోంది. గాలి లేని గాజుసీసాలో ప్రాణాల్ని పోగొట్టుకుంటూన్న వనితలా లేడీ రామారావు మెలికలు తిరిగి పోయింది. 'ఏమి చెప్పను శశీ అంతా నారాత... ఇప్పుడు నేనేమి చేయాలి శశీ! నాకేమీ పాలు పోవటంలేదు. ఇంటిదగ్గరకు వెళ్లాను. తలుపు వేసేసిఉంది. ఇక్కడకు వచ్చాను. వారు కనిపించారు. కాస్సేపటికి నీభర్తా ఆయనా బయటకు వస్తూండటం చూసి, ఆ చీకటిలోకి తప్పుకున్నాను శశీ .... ఆయన ఏమన్నారు త్వరగా చెప్పు శశీ .... నాకు భయంగా ఉంది' అంది.

శశికి ఎలాగ చెప్పాలో తోచలేదు. మెల్లిగా, 'మీరు ఎప్పుడూ ఎనిమిదింటికే ఇంటికి వచ్చేస్తారట కదండి...రాక పోయేప్పటికి వారికి అనుమానం వేసిందటండి...క్లబ్బుకు వెళ్ళి కనుక్కుంటే ఎనిమిదింటికి రిక్షాయెక్కి వెళ్ళిపోయినట్లు చెప్పారటండి. రిక్షావాడి నడిగితే, అక్కడికి దగ్గరిలోనే ఉన్న ఓ తూముదగ్గర ఓ స్త్రీ తన రిక్షాలో వచ్చిందని చెప్పాడటండి. ఆ తరువాత అక్కడి కొక కారు వచ్చిందట...ఆ కారులో ఆస్త్రీ కూర్చోగానే ఆ కారాయనే వాడికి డబ్బులిచ్చి పంపించేశారటండి' అని ఆగిపోయింది.

లేడీ రామారావు ఈమాట వినగానే సొమ్మసిలి పోయింది. శశి ఆమె మొగంమీద గబగబా నీళ్ళు చల్లింది.

ఆమె తేరుకొని, 'ఇప్పుడెలా శశీ.... ఇప్పుడేలా... ఇక నేనేమి చెయ్యాలి వారికంతా తెలిసిపోయింది. ఇక నాకు దారిలేదు. ఇక ఈ పాపిష్టిదానికి చావే శరణ్యం' అంటూ వలవల ఏడ్చేసింది.

శశి గాభరా పడిపోయింది. అద్దంలోంచి ఊడిరాని ప్రతిబింబంలా ఆమె మనసులోంచి మాటలు బయటకు రాలేక పోయాయి. ఆమె కాస్సేపు ఆ లేడీ రామారావువైపు అలాగే చూస్తూ మూగదానిలా కూర్చుండిపోయింది. కొంచెం స్థిమిత పడిన మీదట, 'అసలు ఏమి జరిగిందండి...మీ గురించి మా వారు ఎంతో మంచిగా చెప్పారండి...మీరేమీ భయపడ కండి' అంది.

లేడీ రామారావు శశి అన్న మాటల నూతగా తీసుకొని, కొంచెం తలఎత్తింది. 'శశీ నేను చేసినపని ఏమని చెప్పను....అంత మంచివారికి ద్రోహం తలపెట్టాను. ఇది ఎవ్వరు సహించగలరు? కాని దైవవశాత్తూ నేను కాలు జారడం జరుగలేదు. ఆ కారు మైరుదారిలో పగిలిపోకపోతే నేను ఈ దారికే రాకపోదును. కాని అదీ నా మేలుకే జరిగింది. నేను రక్షింపబడ్డాను. అతను ఎంత బలవంతం చేసినా ఇక అతనితో క్షణం ఉండనన్నాను. అప్పటివరకూ ఎంతో రుచించిన అతని మాటలు ఆ సంఘటన జరిగిన తరువాత నాకు చాలా అసహ్యం వేశాయి. నాకు ఇంటికి వెళ్ళిపోవాలని ఒకటే ఆదుర్దా కలిగింది. కాని మార్గంలేదు. నాకు ముచ్చెమటలూ పట్టాయి. గట్టిగా ఏడ్చాను. అతను ఓదార్చబోతే తిట్టాను. నాకేమీ తెలియదు...నాకేమీ తెలియదు... నన్నింటిదగ్గఱ విడిచిపెట్టు...నన్నింటిదగ్గఱ విడిచిపెట్టు నీకు

పుణ్యముంటుంది...అని బ్రతిమాలుకున్నాను. అప్పుడే అటు ఓ బస్సు వస్తూంటే చేతులు అడ్డంపెట్టి దాన్ని ఆపాను. ఇక అతను నన్నేమీ చేయలేకపోయాడు. బ్రతికాను అనుకున్నాను. అతని కారుటైరు పగిలిపోవడం నాకు బస్సు దొరకడం నా మేలుకే అనుకున్నాను. కాని శశీ...నేనిక్కడకు వచ్చేప్పటికి నాకంతా వ్యతిరేకమే జరిగింది. శశీ! నేను ఊబిలో అడుగు వేయబోయినా....అందులో కాలు పడకముందే ఏవో అజ్ఞాత శక్తులు నన్ను రక్షించాయి. కాని ఇప్పుడెలా శశీ ఇప్పుడెలా...' అంటూ ఆమె తిరిగి విలపించింది.

శశికి ఏమీ తోచలేదు. "ఏమి చేద్దామండి మరి..." అంది. ఇప్పుడు రామం ఉంటే ఎంత బాగుండును అని తన మనస్సులో అనుకుంది. ఆ మీదట చక్కని ఆలోచన తట్టినట్లయి, "పోనీ...ఇదంతా వారికి చెప్పేసి వారిని క్షమించమంటేనండి....వారు చాల మంచివారండి వారు క్షమించగలరండీ" అంది.

వెంటనే లేడీ రామారావు, 'నువ్వు చిన్నపిల్లవు శశీ... నీకు మగవారి మనసులు తెలియవు. ఈ విషయం చెప్పేస్తే... ఇప్పుడు వారు క్షమించ గలిగినట్లే నటిస్తే నటించవచ్చేమో గాని...ముందు ముందు వారి జీవితం నా జీవితం...నరకం మాత్రం అయి ఊరుకుంటాయి' అంది.

శశి, 'అయితే మరేం చేద్దామండి...' అంది అయోమయంగా.

లేడీ రామారావు సముద్రంలో కొట్టుకపోతూ చీపురుపుల్లను ఆసరాగా తీసుకున్నట్లు తలపోసింది. "అయ్యో శశీ...

నన్ను నువ్వు సలహా అడుగుతున్నావా. ఇక నాకు చావు తప్పించి మరేమార్గమూ లేదు. గౌరవంగా చచ్చిపోడానికి వారింట్లో ఈ రాత్రికి కాస్త చోటడుగుతాను. ఇంక ఇంత కన్నా మంచిమార్గంలేదు. అంతే....అదే నాకిక శరణ్యం..." అంది.

ఈమాట వినగానే శశి కంపించిపోయింది. అలాంటి మాటలనకండి...అలాంటిమాటలనకండి...మనస్సు గట్టిపరచు కుంటే ఏమైనా మార్గం దొరుకుతుంది. తప్పక దొరుకుతుం దండి మీరధైర్యపడకండి...."అంది.

ఈ విధంగా శశి చెప్పుతూంటే లేడీ రామారావుకు ఏమిటోతోచినట్లయింది. ఆమె ఆశగా, "శశీ...ఒకటి చేస్తేనో ...సావిత్రి దగ్గరకు వెళ్తాను. ఏమైతే అదే అవుతుంది. ఆవిడ సమర్థురాలు. ఏదో ఉపాయం చెప్పకపోదు. ఔను. అంతేశశీ నువ్వుకూడా రా శశీ....నువ్వు చెపుదువుగాని" అని శశి కళ్ళల్లో కళ్ళుపెట్టి ఆమె మొగంలో ఏమిటో ఆశగా వెదికింది.

ఈ మాట వినగానే శశి మొగం పాలిపోయింది. ఆమె కళ్ళముందు, "ఇలాంటి దానివా శశీ....నాయింటికి తీసుకొ స్తావ్" అని సావిత్రి గుడ్లురిమి చూసినట్లయింది. నాతో మాట్లాడని దానవు ఏమొగం పెట్టుకొని సిఫార్సు చెయ్యడాని కొచ్చావ్ అని చీదరించుకున్నట్లయింది. మా బాగా దొరి కారు...మీ ఇద్దరినీ ఏమి చేస్తానో చూడు... మీ లేడీ రామారావు నిప్పుడు అధఃపాతాళానికి తొక్కేయకపోతే చూడు....అని వికటాట్టహాసంచేసినట్లయింది.శశిభయపడిపోతూ లేడీరామారావుతో మతిపోయిం దానిలా, "నేను వస్తే మీకు

అపకారమే జరుగుతుందేమో నండి... మీరొక్కరే..."
అంటూ మాట నాన్చింది.

శశి భావాలు పూర్తిగా పరిశీలిస్తూన్న లేడీ రామారావు, శశి తననీలా ఒంటరిగా తోలెయ్యడానికి ప్రయత్నించడంతో ఈ శశి కష్టాల్లో ఆదుకునే మనిషి కాదు...అని ఎంతో బాధపడి పోయింది. ఉపయోగం లేనిచోట తన రహస్యం పొక్కిపోవడంతో ఆమెలో రోషం పెల్లుబికింది. కాని శశిని ఏమీ చేయలేనిదై పోయింది. ఇక యిక్కడ ఉండటం శుద్ధ అనవసర మనుకుంది. గబాలున "నువ్వింతదానవనుకోలేదు శశీ...సరే ఎలా జరిగే దలాగే జరుగుతుంది.... నేనే వెళ్తాను. కాని దయచేసి ఈసంగతిమాత్రం ఎక్కడా అనబోకు. ఆ లక్ష్మీదేవిదగ్గర మరచిపోయి మాట్లాడేవు..." అంటూ అక్కడనుంచి లేచి పోయింది.

శశి విస్తుపోతూ, "అదికాదండి....నన్ను నమ్మండి. నన్ను అర్ధం చేసుకోండి...." అని ఆమె ఇంకా ఏమిటో అంటూనే ఉంది. కాని లేడీరామారావు ఆగలేదు. ఆమె ఆ చీకటిలో కలసిపోయింది. శశి అలాగే వచ్చి మంచంమీద కూలబడిపోయింది, "నేనేమి చేశాను...నేనేమి చేశాను...." అనుకుంటూ.

కాస్సేపటికి రామం ఇంటికి వచ్చేప్పటికి శశి, భరించనలవికాని దుఃఖభారంతో క్రుంగి కృశించి పోయిన దానిలా అతనికి కనిపించింది. "ఏమిటి శశీ అలా ఉన్నావు" అన్నాడు.

శశి గబగబా వెళ్ళి తలుపు వేసేసి, "లేడీ రామారావు వచ్చారండీ" అంది.

వెంటనే రామం "ఎవరూ...." అన్నాడు.

"ఔనండి....ఆవిడే, ఇప్పుడేఇక్కడనుంచి వెళ్ళిపోయింది"

"తిరిగి ఎక్కడికి వెళ్ళింది ఇంత రాత్రివేళప్పుడు?" రామం ఆదుర్దా పడ్డాడు.

"ఆ సావిత్రిగారింటికి వెళ్ళిందండి. నన్నుకూడా వెంట రమ్మన్నదండి. కాని నేనేమిటో భయపడ్డానండి. సావిత్రికి నాకూ విరోధంగా... నేను వెళ్తే వ్యతిరేకమే జరుగుతుందనుకున్నాను. పాపం ఒక్కతే వెళ్ళిపోయిందండి... ఆ యిద్దరికీ పడదుకూడాను. ఏమిచేస్తుందో సావిత్రి" అంది శశి.

రామం ఒక్కసారి శశివైపు తీక్షణంగా చూసి, "ఎంత పనిచేశావుశశీ. పైగా యింటరు ఫస్టు క్లాసులో ప్యాసయ్యావు కూడాను. ఏం లాభం. సమయానికి లేని తెలివి.... ఇప్పుడా సావిత్రి తనమాట వినదేమో నని ఈవిడ అలాగే ఏ యేట్లోకో పోయి పడితే....ఈలాంటి సమయాల్లో మీ కల్లబొల్లి విరోధాలకు విలువలుంటాయనుకున్నావా... నాకేమీ నచ్చలేదు. నువ్వుకూడా వెళ్ళి ఉండవలసింది. ఆమెకెంత నిబ్బరంగా ఉండి ఉండును? నువ్వు ఆమెకు స్నేహితురాలవై ఉండికూడా...శత్రువుకన్నాహీనమైపోయావుశశీ....

శశి మొగంలోఉన్న కాస్త తేజస్సు ఈ మాటలతో పూర్తిగా హరించిపోయింది. 'నాకప్పుడేమీ తోచలేదండి... మరి ఇప్పుడేలా...ఎలాండి...పోనీ నేనిప్పుడు వెళ్ళితే....' అంది.

రామం శశి అమాయకత్వానికి నవ్వుకోబోయాడు. కాని అతనికి నవ్వురాలేదు. 'ఇప్పుడెందుకు...ఈ పాటికావిడ అక్కడ కెలాగూ వెళ్తుంది. సావిత్రి నీలా తెలివితక్కువది

కాదులే. కాని నువ్వు...సావిత్రిగారింటికి ఆవిడ చేరేవరకూ సహాయంగా ఉండవలసింది.' అన్నాడు.

అప్పుడు శశి, 'ఔనండి...మరి ఇప్పుడామె అక్కడకు వెళ్ళిందో లేదో...ఎలా తెలుస్తుంది. కొంపతీసి చచ్చిపోదు కదాండి' అంది.

'అదే ఆలోచిస్తున్నాను శశీ...ఔను...కాని ఇంతకీ ఎక్కడికెళ్లా నంటుంది...అతను చెప్పింది నిజమేనా...'

'నిజమేనటండి...లేకపోతే మరి సావిత్రి ఇంటికి వెళ్ళడం ఎందుకూ...'

'సరే...ఇక నువ్వు పడుకో...నేను సావిత్రిగా రింటికి వెళ్ళి, లేడీ రామారావుగా రక్కడున్నట్లు ఆచూకీ తెలిస్తే, తిన్నగా రామారావుగా రింటికి పోయి, అక్కడ ఆయన దగ్గఱ పడుకుంటాను. లేకపోతే చేయవలసిందేమిటో ఆమీదట నిర్ణయించు కుంటాను. ఆవిడ కనిపించకపోతే నీకువచ్చి చెప్తా. అనవసరంగా నువ్వు మాత్రం దిగులుపెట్టుకోకు...తలుపేసుకో...' అంటూ రామం బయటకు వెళ్ళిపోయాడు.

పాపం శశికి ఆ రాత్రి నిద్రపట్టలేదు. "ఇంతకీ లేడీ రామారావు బ్రతికి ఉందా. చచ్చిపోయిందా" ఇవే ఆలోచనలతో ఆమె మనస్సు గిజగిజ కొట్టుకుంది.

'ఎంత తెలివి తక్కువగా ప్రవర్తించాను! నే నెందుకూ పనికిరాను. నా కేమీ తెలియదు.' అనుకుంది. అలాగే నిద్ర పోయింది. కలత నిదురలో లేడీ రామారావు వంతెన మీంచి ఏట్లోకి దుమికినట్లు కలగాంచింది. కెవ్వున అరచి మంచంమీంచి లేచింది. 'కల' అని తెలిసికూడా స్తిమిత పడలేక పోయింది. కిటికీలోంచి చీకటి ఆమె కొక ఏరులా కనిపించింది. అప్పుడే

ఆకసం మీదించి ఓ చుక్క రాలిపోయింది. చీకటి ఏటిలో కని పించకుండా కొట్టుకపోయింది. శశి గుండెలు చీకటిలో కొట్టు కున్నాయి. 'ఇంకా తెల్లవారదేమి...ఇంకా తెల్లవారదేమి...' అని పాప మా రాత్రి ఆమె తపించిపోయింది.

చీకటి మొక్కకు వెలుతురు పువ్వులా సూర్యుడు ఉద యించాడు.

శశి నిద్రలేచింది. రామం ఇంకా ఇంటికి రాకపోయే ప్పటికి సావిత్రి దగ్గర లేడీ రామారావుందని నిర్ధారణ చేసు కుంది. లేడీ రామారావు తన గురించిపడిన అపోహను ఆవిడ సావిత్రిగారింటి దగ్గర ఉండగానే పోగొట్టుకోవాలనుకుంది. ఈ విధంగా అక్కడకు వెళ్ళడంవల్ల సావిత్రి కూడా సంతోషిస్తుం దని అనుకుంది. తను అనవసరంగా భయపడినట్లు నిజం చెప్పేసి, వాళ్ళదగ్గర క్షమాపణ కోరుకోవాలి అనుకుంది. ఇంతకీ సావిత్రి, పాపం లేడీ రామారావును, ఈ ఆపదల నదీ గర్భంలోంచి ఒడ్డుకెలా ఈడ్చుకొస్తుందో చూడాలి అనుకుంది. రామం వస్తే వెళ్ళనివ్వడేమోనని గబగబా తయారై పోయి, సావిత్రిగారింటికి బయలుదేరింది. రామం ఇంటికి వస్తూంటే గట్టిగా 'ఫ్లాస్కులో కాఫీఉంది....తాగండి....' అంటూ అతను ఏమిచెప్పేది విని పించుకోకుండానే హుటాహుటిగా అడుగులు ముందుకు వేసింది.

శశి, సావిత్రిగారింటికి వెళ్ళేటప్పటికి ఆ లోపలిగదిలో సావిత్రి రామారావుగారితో యేమిటో మాట్లాడుతోంది. శశి లోపలకు వెళ్ళలేకపోయింది. ఇంటికి తిరిగి వెళ్ళాలనీ అనుకో లేక పోయింది అక్కడే అలాగే నిలుచుండి పోయింది.

ఆ గదిలోపల, 'ఏమండీ రామారావుగారూ! మీరు భలేవారే...మీరిలా చేస్తారని నేనెప్పుడూ అనుకోలేదు సుమాండి' అని సావిత్రి అతనివైపు నవ్వుతూ చూసింది.

రామారావు ఒక్కసారి తబ్బిబ్బయిపోయాడు. ఏదో పెద్ద తప్పు చేసినవాడిలా మొగంపెట్టి ఆమెవైపు అలాగే చూస్తూ కూర్చుండిపోయాడు.

"నిజం చెప్పొద్దూ...రాత్రి మా ఆయనగార్ని మీ ఇంటికి పంపించాలని నాకు ఏమాత్రం అనిపించలేదు. మిమ్మల్ని ఆమాత్రం బాధపెట్టడం మంచిదని అనుకున్నాను. అయినా ఆవిడ ఎక్కడ ఉంటే మీకేం లెండి, మొగరాజులు...మీ కెలాగైనా చెల్లిపోతుంది' అని కాస్త ఆగి దగ్గింది.

రామారావు ఆమె ధోరణి అర్థంకాక తెల్లబోయాడు. ఏమి వినవలసి వస్తుందో అని భయపడ్డాడు.

ఆమె తిరిగి ఆరంభించింది. 'ఈ వీధిలోని కొద్దిమంది మంచివాళ్ళల్లో మీరొకరనుకున్నాను. నిన్న ఎనిమిదింటికి మీవారు క్లబ్బు విడిచి, యింటికి వచ్చేస్తూంటే నాకేమిటో ఎప్పటినుంచో, మా ఇద్దరిమధ్యా ఉన్న దెబ్బలాటకు స్వస్తి చెప్పాలనిపించింది. వారిని పలకరించాను. వారు నన్నూ పలకరించారు. చిత్రం....మా ఇద్దరిమధ్యా విరోధమే లేదు. ఇన్నాళ్ళూ వారి స్నేహాన్ని దూరం చేసుకున్నందువల్ల వచ్చిన లోటు మరెప్పటికీ పూడదనిపించింది. ఇంత విచిత్రంగా మా ఆంతర్యాలు కలసినందుకు నాకేమిటో మేమిద్దఱమూ కలిసి సహపంక్తిని భోజనం చెయ్యాలనిపించింది. ఆవిడ తాను మొర్రో అంటున్నా...ఇప్పుడుకాదు మరొకసారి అని అడ్డుచెపుతున్నా...నా

పట్టుదల మీకు తెలుసుగా... నేను వదలుతానూ...సస్సేమిరా అది కుదరదన్నాను....ఎక్కడికో పారిపోయావని మీ ఆయన గారు బెంగెట్టుకోరులే అని లాక్కొచ్చేశాను. భోజనం అయిన మీదట కాస్సేపు పిచ్చాపాటి మాట్లాడుకొని, ఆవిడను మీ యింటివరకూ దిగబెట్టాలని బయలుదేరాను. ఆవిడ ఒక్కతె నే వెళ్ళిపోగలనండీ...మీరు వెనక్కి వెళ్ళండి....అంది. కాని నేను ఆమెతో బయలుదేరడమే మంచిదయింది సుమాండి...తీరా మీ యింటికొచ్చి, చూసేసరికి ఏముంది...తలుపు తాళంవేసేసి ఉంది. ఎక్కడకు వెళ్లారు చెప్మా...ఎప్పుడూ ఇల్లు కదలి వెళ్ళరే....' అని అంటూనే ఆవిడ, ఒకవేళ ఎదురింటి రామం గారి దగ్గఱ కూర్చున్నారేమోనని అక్కడకు వచ్చింది. అయితే తెలియక అడుగుతాను. ఎప్పుడూ లేనిది, రాత్రిపూట మీరు రామంగారింటి కెందుకు వెళ్ళినట్లు...' అంటూ సావిత్రి ఏదో కూపీ లాగుతున్నట్లు ప్రశ్నించేసరికి—

రామారావుగారు తడబడే కంఠంతో "అబ్బే ఏమీ లేదండి. రామంగారికీ నాకు చాలా స్నేహం. ఒకవేళ కలక్టరు గారి భార్యతో బాతాఖానీ వేసుకొని కూర్చుండి పోయిం దేమో...అని, ఏమీ తోచకపోతే కాస్సేపు రామంగారితో మాట్లాడుతూ కూర్చుందామని వెళ్ళానండి" అన్నాడు. తను చేసిన పని ఎంతో నీచమైనదైనట్లు, తనకు సొసైటీలో ప్రవ ర్తించడం బొత్తిగా చేతగాదన్నట్లు ఎక్కడ ఋజువై పోతుందో ఏమో అని పాపం అతనెంతో భయపడి పోయాడు.

సావిత్రి తిరిగి తన వాగ్ధోరణి సాగించి, "మీరు మాట్లా డటానికి వెళ్ళారో మరెందుకు వెళ్ళారో గాని అదే మీ కొంప

ముంచింది. మీ ఆవిడగా రక్కడ కొచ్చేసరికి, ఏముంది... ఆ శశి లేదూ...అందాలబొమ్మ...మీ వైపేమిటో మిమ్మల్ని తాగేస్తున్నట్లు చూస్తోందట. మీరామె వైపు అలాగే చూస్తూ కూర్చున్నారట. అందులో శశి, అంత మంచిది కాదని నాకీ మధ్యే తెలిసింది. ఇంతకీ శశి చూపుల్లో మీ ఆవిడగారు ఏమి పసిగట్టిందో కాని మీ రక్కడకు వెళ్ళడాని కదే కారణం మంటుంది. ఇంకేముంది, నేనిక బ్రతకను, చచ్చిపోతాను ఇక నే నాయన మొగం చూడను అంటుంది. అప్పుడు నాకు ఏమీ పాలుపోలేదు. బాబ్బాబు నీకు పుణ్యముంటుంది, అలాంటి పని మాత్రం చేయబోకు అని ఇక్కడకు తీసుకొచ్చేశాను. ఈ విష యాలన్నీ మా ఆయనగారు మీ కెలా చెప్పగలరు? చెప్పమన్నా ఆయన వాటిని తిరగేసి అంతా రసాభాస చేసేరకం కూడాను. అందుక నే ము_క్తసరిగా...వారిక్కడ ఉన్నారు...మరేం భయం లేదు...అని చెపితే చాలన్నాను. ఇక విషయం మీకు పూర్తిగా అర్థమైం దనుకుంటాను. అదిగో ఆవిడగా రిక్కడ ఉన్నారు... ఇక్కడ మీరున్నారు. ఇక మధ్య నేనెందుకు. ఏమి చెప్పు కుంటారో చెప్పుకోండి....ఇంతా చేస్తే వడ్లగింజలో బియ్యపు గింజ" అంటూ సావిత్రి తనప్రసంగాన్ని ముగించింది.

పాపం బయట గదిలో నిలబడిన శశి నిలుచున్న పాటున కూలబడిపోయింది. 'అన్యాయం, అన్యాయం' అని ఆమెకంఠం అరవబోయింది. ఆమె కాళ్ళక్రింద అగ్నిజ్వాలలు లేచి ఆమె శిరస్సువరకూ దహించివేయడం మొదలుపెట్టాయి. ఆమె అక్కడ క్షణం ఉండలేకపోయింది. ఆమె అణువణువునా కాలి పోతూ ఇంటికిచేరి గభాలున ఇంట్లో ప్రవేశించి, 'ఇంక ఈ

వీధిలో ఉండొద్దు. . .ఇంక ఈ వీధిలో ఉండొద్దు' అని గట్టిగా రామం దగ్గర ఏడ్చేసింది.

# 3

అవి సొసైటీ బిల్డింగులు. ఆ ఇళ్ళమధ్య, మూడు, నాలుగు పెద్దరకం కార్లను ఒక దాని ప్రక్క ఒకదాన్ని నిల బెట్టి సునాయాసంగా నడిపించటానికి వీలైన విశాలమైనరోడ్లున్నాయి. ఆ యిళ్ళ వెనుకా ముందూ ఇళ్ళ సైజుకు తగ్గట్టుగా కాళీ స్థలాలున్నాయి. వాటిలో రకరకాల పూల మొక్కలూ, ఎన్నోఅందాల క్రోటన్సు మొక్కలూ, పోక చెట్లూ, అశోక వృక్షాలు, మల్లెపందెరలూ, నైట్‌క్వీనులు... ఎవరికేవి ఇష్టమో అవి పచ్చగా, కనులకింపుగా...అందానికి గిలగింతలుగా, వయ్యారానికి పులకింతలుగా మనసుకెంతో హాయిగూర్చు తున్నాయి.

ఆ వీధిలో జనండున్నారు కాని సంచారం తక్కువ. అక్కడో కారు ఆగుతుంది. ఇక్కడోరిక్షా నిలుస్తుంది. కారు చప్పుడుచేయకుండా వెళ్ళిపోతుంది. రిక్షా మువ్వ పాపం మ్రోగ టానికి గిలగిల కొట్టుకుంటుంది. కరివేపాకు ముసలమ్మలు చీక టినే వస్తారు. నోరెత్తకుండా అమ్ముకుపోతూ వుంటారు. దొడ్డి గుమ్మందగ్గరకు వెళ్ళి, అమ్మగారి కేవేవి కావాలో అవి ఇచ్చి, కిక్కురుమనకుండా వెళ్ళిపోతారు. అప్పుడప్పు డా అమ్మగారు 'ఇది...నమ్మకంగా యిస్తుందండీ...' అని వాళ్ళాయనగారితో చెప్పుకొని మురిసిపోతారు. ఇక్కడ నమ్మకం అంటే, ఏరోజునా ఇంటికి రావడం ఎగెయ్యదనే అర్థం. అప్పుడా ముసలమ్మ 'మీ

పాదాల దగ్గర బతికే వాళ్ళమండి... నమ్మకంగా ఇవ్వకపోతే మాకు బతుకే లేదండి...' అంటుంది. ఆమాటతో ఆ అమ్మ గారి పాదాలు బంగారు పూతతో మెరసిపోతాయి.

ఆ మీదట పాలసొసైటీనుంచి వచ్చినకుర్రాడు, పాలు పోసి సన్నని కూనిరాగం తియ్యకుండానే సైకిలెక్కి జారు కుంటాడు. పేపరు కుర్రాడొచ్చి కిటికీ సందులో నుంచి పేపరు జార్చేసి తలెత్తకుండానే వెళ్ళిపోతాడు.

ఇక పదిగంటలకు, ఆఫీసులకు పోయేవాళ్ళు ఆఫీసులకు, కాలేజీలకు పోయేవాళ్ళు కాలేజీలకు, కోర్టులకు వెళ్ళేవాళ్ళు కోర్టులకు వెళ్ళేటప్పుడు జరిగే హడావుడే హడావుడి! అప్పుడే కాస్తసందడి! నమస్కారాల బదిలీలు, చిరునవ్వుల కలయికలు, విద్యార్థుల సన్నని విజిల్సు,విద్యార్థినుల చీరచెంగుల విసుర్లు, సైకిళ్ళ గణగణల పాటలు, రిక్షాల గియ్‌గియ్‌ల రుసరుసలు కదలిపోతాయి. తిరిగి నిశ్శబ్దం ముసురుకుంటుంది.

వంటమనిషిని, పనిపిల్లను కాపలాకాస్తూ కాస్సేపు యజమానురాలు అటూఇటూ తిరుగుతుంది. కాస్త కాళ్ళు నొప్పులు పెట్టిన పిమ్మట—ఆ పని మనిషిని, పనిపిల్లను, మంచి వాళ్ళగానే ఊహించుకొని మొదట వాళ్ళను శంకించి కాపలా కాసినందుకు ఆమాత్రం చెకింగ్ అవసరమని, అలా చేసినందు లకు తననూ తాను అభినందించుకొని, తీరిగ్గా మంచమెక్కి, బలవంతంగా నిద్ర నాహ్వానించి, హాయిగా పగటికలల పల్లకి ఎక్కి బోయీలు లేకుండానే ఎక్కడెక్కడో విహరిస్తుంది.

తిరిగి మధ్యాహ్నం ఆ వీథుల్లో కాస్తఅలికిడి. సాయంత్రం అయ్యేటప్పటికి అక్కడ మళ్ళీ నిశ్శబ్దం చెంగుపరచు కుంటుంది.

సన్నని గాలుల కదిలే చిగురుటాకులు, కిటికీ మొహాల వ్రేలాడిన సిల్కు తెరలు ఒకరి సొద ఒకరు చెప్పుకుంటాయి. అంతా రహస్యంగానే కానిస్తాయి. గదుల్లోంచి విద్యుద్దీపపు కాంతులు వీధిలో చొరబడటానికి గింజుకుంటాయి. గుమ్మాలపైన ఉన్న ఆకుపచ్చ, నీలంరంగు దళసరి అద్దాలలో కాంతులు అలిసిపోయి నిద్రపోతాయి. రేడియో తనలో తనే గొణుక్కుంటుంది. యజమాని చదువుతూన్న పుస్తకం బాపతు పుటలు కాస్త వెనక్కు పడ్డప్పుడల్లా ఇంత కాగితపుచప్పుడౌతోంది. అంతే. పరిశుభ్రత, సౌందర్యారాధన, నిశ్శబ్దంలోని ఎనలేని మాధుర్యం అక్కడి ఇళ్ళల్లో, మనుషుల్లో, వారి వారి పనుల్లో నిండి నిబిడీకృతమై ఉంటుంది. కాని....కాని...అక్కడివారి మనసుల్లో మలినం పేరుకుంటోంది. విశాలమైన హృదయాలకు బదులు, విశాలమైన వీధులే వెలసిఉంటున్నాయి. సౌందర్యారాధన బాహ్యానికేగాని ఆంతర్యానికి పట్టడంలేదు. అనంతమైన ఆనిశ్శబ్ద మాధుర్యం....వారి ఆత్మల్లో వసించే వీలులేక, అక్కడ ఇల్లులేక ఆ యిళ్ళబైట గాలికి తిరుగుతున్నట్లు తిరుగుతోంది!

లక్ష్మీదేవి ఒకానొకప్పుడు తిండికి మొగం వాచిన మనిషి. కాని కొద్దికాలంలోనే లక్షాధికారిణి అయింది. కాని ఇటీవల ఆమె అదృష్టం బాగులేదు. లక్ష్మీదేవి ఇంట్లో లక్ష్మి కనబడటం లేదు. ఇప్పుడామె గుట్టుగా పేదతనాన్ని అనుభవిస్తోంది. ఆ భవనంమీద ఇప్పటికే బోలెడన్ని అప్పులు పెరిగిపోయి ఉన్నాయి. భర్త భూషణం సంపాదన ఎటువంటిదో ఆమెకు పూర్తిగా తెలుసు. అతను ఒకటోరకం జూదగాడు. అతని చక్రం ఇప్పుడాతనికి అనుకూలంగా తిరగడంలేదు. అతని మోసాలిప్పుడు మిత్రుల ఇళ్ళవాసాలను లెక్కచూస్తున్నాయి.

ఎవ్వరూ అతన్ని దగ్గరకు చేరనివ్వటం లేదు. అతనంటే ఇప్పు డందరికీ రోత.

మనిషి స్థూలంగా ఉంటాడు. కళ్ళు గుచ్చిగుచ్చి చుట్టూ వున్న వాళ్ళంతా తనను చూడాలన్నంత ఆకాంక్షతో తిప్పుతూ వుంటాడు. మాటలమధ్యలో కొందరు మిత్రులు వికారంగా నవ్వేందుకు వీలుగా కన్ను కొడుతూ వుంటాడు. 'అవ్వాఁ' అంటూ చేతిని మాటి మాటికీ, మాటలమధ్య నోటికి అడ్డం పెట్టుకొని, ఫకాలున నవ్వుతూ, ఆ నవ్వును మధ్యలో తుం చేస్తూ చేతిని నీరసంగా ఆడిస్తాడు. ఇదీ...అతని వాలకం. అతన్నిచూస్తేనే చాలు సజ్జనులు హృదయం డోక్కుంటుంది.

ఇప్పుడతను, ఫేలయ్యే విద్యార్థులను ప్యాసుచేయించ డానికి నడుంకడుతున్నాడు. తన కెంతో పలుకుబడి ఉందని డబ్బాలా వాగుతున్నాడు. తన సహకారంవల్ల ఎవరూ సాధించ లేని రాచకార్యాలు క్షణాలమీద సాధించబడతాయని, వెయ్యి కంఠాలతో ఎక్కడబడితే అక్కడ చెప్పుకుంటున్నాడు. కాని ఎక్కడా అతని కింతకూడా ఆసరా దొరకడంలేదు. రోజులు గడవడమే కష్టమైపోతూంది.

ఆ రాత్రి లక్ష్మీదేవికి నిద్రపట్టలేదు. ఆమె ఆలోచనలు ఒక దరికి చేరడంలేదు. అవి ఆమె నెక్కడెక్కడికో తీసుకు పోతున్నాయి. ఆలోచిస్తూ...ఆలోచిస్తూ, 'అమ్మోఁ...' అనుకుంది ఒకసారి. 'మరేం ఫరవాలేదు. ఇందులో కొంప మునిగిపోయే దేమీలేదు' అనుకుంది. అందరినీ ఒకసారి కలు సుకోవాలి. పరిస్థితులెలా ఉన్నాయో పరీక్షించాలి అనుకుంది. "దేవుడు మేలుచేస్తే అంతా సక్రమంగానే జరిగిపోతుంది" అనుకుంది. మెల్లగా నిద్రలోకి కూరుకపోయింది.

అది సరియైన నిద్రకాదు. పూర్తిగా కలత నిద్రాకాదు. కాని బాహ్యప్రపంచం ఆమెకేమీ తెలియడంలేదు. అప్పుడే... ఎవరిదో పొట్టచీల్చినట్లు ... భయంకరమైన ఒకకలకాచి నిద్రలోనే వికారంగా మూల్గింది. ఆ తరువాత ఆమెకు మెలకువ వచ్చినట్లే వచ్చింది. కాని తిరిగి నరాలు మత్తుగా నిద్రనుతాగి వంటికి మైకం కలిగించాయి. ఈసారి, ఆమె శశి కళ్ళు, తన రెండు చేతులతోనూ పెరికి వేస్తూన్నట్లు కల గాసింది. ఆ తరువాత ఆమెకు నిద్రపట్టలేదు. ఓ గ్లాసుడు మంచినీళ్ళు తాగి తిరిగి నిద్ర పోయింది. ఈసారి ఆమె ఎవరిదో ఇంటిగోడ, అర్థరాత్రి చిట్ట చీకటిలో గునపంతో త్రవ్వి, ఆ కన్నంలోంచి లోపలికి దూరి ఏదో దొంగిలిస్తూన్నట్లు కల గాచింది. లక్ష్మీదేవి మేలుకొని గుండెలమీద చేయి వేసుకొని స్తిమితపడబోయింది. కాని గుండెల దడ హెచ్చింది. అది కాస్త తగ్గిన పిమ్మట విసుగ్గా 'వెధవకలలు' అని తిరిగి నిద్రపోవటానికి ప్రయత్నించింది.

తెల్లవారింది. చీకట్లను చిదగ్గొట్టి సూర్యుడు కొంత పైకి సాగాడు. లేడీరామారావు కిటికీలోంచి శశి ఉన్న ఇంటివైపు జాలిగా చూస్తోంది. అప్పుడే లక్ష్మీదేవి, తన చిన్నకొడుకును నడిపించుకొంటూ, శశి ఉన్న ఇంటివైపు వెళ్ళడం చూసింది. ఆమె గుండెలు పీచుపీచు మన్నాయి. 'తప్పకుండా లక్ష్మీదేవి శశిదగ్గర కూపీ తీస్తుంది. ఆమె అసాధ్యురాలు. తను శశితో మాట్లాడకపోవడం ఈపాటికే గ్రహించి ఉంటుంది' అనుకుంది. ఒక నిట్టూర్పు విడిచింది. అలాగే చూస్తూ నిలబడింది. 'శశితో ఇంక ఎలా మాట్లాడటం....ఇప్పట్లో ఆమెతో మాట్లాడితే... ఆయన తప్పకుండా నిజం గ్రహించవచ్చు. అందులో ఒట్టి అనుమానం మనిషాయె. సావిత్రిని ఆయన నమ్మబట్టి కాని లేకపోతే

తను ఈపాటికి ఏమయ్యేదో...కొంపతీసి సావిత్రి ఈ విషయాల నేక్కడా బయటపెట్టదు కదా!....ఇక ఆమెతో ఎప్పుడూ ఏ రూపంలోనూ జగడం పెట్టుకో కూడదు. ఆమెను కొంచెం అంటిపెట్టుకునే ఇక తిరుగుతూ వుండాలి. ఇది సరేకాని, కొంప తీసి శశి...మరచిపోయిగాని, పొరపాటున గాని ఈలక్ష్మీదేవి తో అసలు సంగతి చెప్పెయ్యదుకదా! శశి అలాంటిది కాదు. జాగ్రత్తగానే ఉంటుంది. కాని ఏ ఆదమరుపుగా ఉన్నప్పుడో చెప్పేస్తే....ఇంకేమైనా ఉందా...అనుకుంది. "సరే....ఎలా జరిగేది అలా జరక్కమానదు. ఏమిచేస్తాను...తప్పుచేసిన తరు వాత అనుభవించక తప్పుతుందా ఏమిటి...." అనుకుంది. "కాని చిత్రం....అంత త్వరగా అనుమానపడి, వెంటనే అన్ని పరీక్షలు చేసేసిన ఈయనగారు సావిత్రి అలా మాట్లాడేప్పటికి, తను నిజంగా ఎంతో పెద్ద పొరపాటు చేసినట్లే బాధపడిపోయారు. ఇంతలోనే అనుమానం...ఇంతలోనే ఎంతో నమ్మకం....ఏమి టో ఈ మగవాళ్ళ మనసు. కొంపదీసి తనను శశి నిజంగా ప్రేమి స్తోందేమోనని ఆమెవైపు దృష్టి మరల్చరు గదా...చఛ... ఆయన అలాంటివారు కాదు. కాని ఏమో...ఇంతకీ ఆయన తనను మనస్ఫూర్తిగా నమ్మినట్లు ఏమిటి దాఖలా..." అను కుంది.

అప్పుడే పైకట్టుకొని, నల్లకోటు నల్లబూటు సరిచూసు కొని, ఏమాత్రం ఫైలులేని ప్లీడరు రామారావుగారు, 'ఇలా రా...' అంటూ ప్రియభార్యామణి నొక్కసారి డ్రాయింగు రూములోకి పిలిచాడు.

"ఏమండీ..." అంటూ ఆమె అతని దగ్గరగా వెళ్ళింది. వెళ్తూ నవ్వింది. ఆ నవ్వులో ఏదో భయం తొంగిచూసింది.

అతను ఆమెనుచూసి నవ్వాడు. వెలితిగా ఉన్న బిందెలోని నీళ్లు తబకు తబకున కదిలినట్లు ఆ నవ్వు కదిలింది,

"అక్కడ ఉండిపోయావేం..." అన్నాడు జాలిగా. "నన్ను నమ్మవూ....." అన్నాడు హృదయంతో. ఆమె ఒక్కసారి విస్తుపోయింది. ఈయన, శశిని ప్రేమిస్తాడేమో అని అనుకున్నందులకు వింతగా నవ్వుకుంది. ఆ నవ్వు ఆమె పెదవులు దాటి అతనికి సుమనోహరంగా కనిపించింది. ఆమె మెల్లిగా అతని నుదుట మీద ముద్దుపెట్టుకొని, "ఛా...ఏమిటండీ...ఆమాటలు...నేనెప్పుడో మఱచిపోయాను..." అంది. అతను తృప్తిగా కోర్టుకు వెళ్ళిపోయాడు.

రామానికి తను తన భార్యను శంకిస్తూన్నట్లు చెప్పినందుకు తనలో తను ఎంతో బాధపడిపోతూ కోర్టుకు హాజరయ్యాడు. "రామం మంచివాడు. కాని...నేను తొందరపడ్డాను. నేను నిజంగా పిరికివాణ్ణి... మనిషికింత పిరికితనం పనికిరాదు. ఇక ఎప్పుడూ, ఆమెనిలా అనుమానించరాదు. మంచివాళ్ళ నను మానించడం దుర్జనుల లక్షణం. అసలు నేను శశిని ప్రేమిస్తున్నానని ఎలా అనుకుందో...అదే విచిత్రం...ఆడవాళ్లు మగవాళ్ళు ఒక్కలాగే ఆలోచిస్తారు. ఆమె నన్నూ, నేను ఆమెనూ అనుమానిస్తూ ఒకరికి ఒకరు దూరమై పోతున్నామన్నమాట! బలేగాఉంది. మొత్తానికి ఇద్దరమూ మంచివాళ్ళమే! కొంపతీసి రామం నేనిలా అనుమానించినట్లు ఎక్కడైనా బయటపెట్టడు గదా...అతను అనకపోయినా ఆ శశి......మంచిదికాదట కూడాను...బయటపెడుతుందేమో....ఏముందిమంచివాళ్లుగా బ్రతుక లేనివాళ్లు...ఇతరుల్లో ఇంత తప్పు కనిపిస్తే దాన్ని అంత

చేసి ఏదో సుఖం బావుకున్నట్లు సంతోషిస్తారు. కాని రామం మంచివాడు. అతనితో ఈ విషయం చెప్పాలి. వాళ్ళ శశి, కొంచెం ఈ ప్రస్తావన ఎవ్వరిదగ్గరా తేకుండా ఉండేట్లు చూడమని చెప్పాలి." అనుకున్నాడు. పనిలోకి మునిగిపోయేముందు, తిరిగి "రామంతోకూడా ఇక నేను రహస్యంగానే మాట్లాడాలి. కొంపతీసి నే నతనితో మాట్లాడుతున్నానని ఇంట్లో తెలిసిందంటే శశితో పరిచయం సంపాదించడాని కిది మార్గమనుకొని, అసలుకు మోసం రావొచ్చు. ఔను. కొంచెం ఇలాంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండటం ఎంతైనా అవసరం. అయినాగాని, అంత త్వరగా తను ఆమెను అనుమానించడం, పెద్ద పరీక్షాధికారిలా ఊరంతా గాలించెయ్యడం, రామం ముందు అలా గోలెత్తడం, తలచుకుంటే ఇప్పుడు అసహ్యం వేస్తోంది. ఛీ...ఎంత తప్పుపని చేశాను. తనను చూసి, రామం ఎంత నవ్వుకుంటున్నాడో ... ఆ శశికూడా అంతేకదూ ... పాపం రామం. ఆ శశి ఎంతో మంచి పెళ్ళామని కులుకుతున్నాడు. ఈ విషయం తెలిస్తే అందులో సావిత్రిగారు చెప్పింది, ఎప్పుడూ అబద్ధమయి ఉండదు. దెబ్బని గుండె పగిలి చచ్చిపోడూ... ఇంతకీ నేనసలు మంచివాణ్ణి కాను....నా సంగతెక్కడైనా ఎత్తాడంటే చూడు...ఏమి చేస్తానో వాడిపని' అని తృప్తిగా ఆలోచించుకొని, పూర్తిగా పనిలో మునిగిపోయాడు.

చిన్న కొడుకును చక్కగా నడిపిస్తూ లక్ష్మీదేవి ఇంటికి రావడంతో శశి, మనసులో విసుక్కుంది. అసలే సావిత్రి వేసిన అపనిందతో ఆమె కృశించిపోతోంది. ఆమె వీధి మొగం చూడలేక పోతోంది. వీధిలో ఎవ్వరిని చూసినా అసహ్యించుకుంటోంది. 'ఒక్కరిలోనూ మంచితనం లేదు. అంతా దుర్మా

గ్గులు...' అనుకుంది. 'సావిత్రి ఎంతమాట అంది...కాకుల్ని కొట్టి గద్దలకువేసే రకం...ఆమె మనసింత నీచమైనదని, తను ఎప్పుడూ అనుకోలేదు. తను మంచికిపోతే చెడు ఎదురైంది. ఇదే లోకం తీరు కాబోలు' అనుకుంది. వచ్చిన లక్ష్మీదేవితో 'కూర్చోండి అక్కయ్యగారూ...'అంది.

లక్ష్మీదేవి కూర్చోకుండానే, 'మరేం లేదమ్మాయ్.... ఈ వెధవున్నాడు చూడు. పిన్నిగారింటికి వెళ్దామే...పిన్నిగారింటికి వెళ్దామే అని తెగ పీకేస్తున్నాడు. పొద్దుట సుందరమ్మ కొడుక్కి నువ్వు మిఠాయుండ ఇచ్చావటగా... అది వాడు, వీడికి చూపించి, ఊరించాడు కాబోలు...అప్పటినుంచీ వీడు ఒకటే గోల. పోయి శశి పిన్నిని అడగరాదటరా ఇస్తుంది అంటాను. కాని అక్కడనుంచి రాయిలా కదిలేనా? నువ్వు రా...నువ్వురా అని ఒకటేగోల. బాబ్బాబు నీకు పుణ్యముంటుంది; వీణ్ణి నువ్వు పెంచుకుందూ మాకు సగం గోలైనా తగ్గుతుంది. మాయదారి పిల్లలు.... ఛస్తున్నాను వీళ్ళను పెంచలేక!" అని, "ఏరాః...పిన్ని దగ్గర ఉండిపోతావాః...మిఠాయిలు, సున్నుండలు, కజ్జికాయలు అన్నీ పెడుతుంది" అంది.

శశి ఒక నవ్వు నవ్వుకొని వాడికి మిఠాయుండ ఇచ్చి, 'కూర్చున్నారుకాదు' అంది.

లక్ష్మీదేవి, "వస్తానమ్మాః.... బోలెడంత పని...ఒకరా ఇద్దరా...ఈ మందికి చేసేప్పటికి నాపనై పోతోంది. అవునుగాని శశీ...నీ చంద్రహారం ఎన్ని కాసుల్దీ అన్నావ్...ఒకసారి మా అక్కయ్యగారి కూతురిక్కడకు వచ్చిందది గుర్తుందా? అది

ఇలాంటిదే నువ్వు పెట్టుకున్నలాంటిదే...చేయించమని తెగ చంపేస్తోంది. ఏదీ ఒకసారి ఇలాఇయ్యి చూసిస్తాను..."అంది.

శశి, అది ఎన్ని కాసులఎత్తో దానికెంత డబ్బు ఖర్చయిందో చెప్పి లక్ష్మీదేవి చేతిలో ఆ వస్తువును ఉంచింది.

లక్ష్మీదేవి కళ్ళు ఒక్కసారి జిగేల్‌మన్నాయి. ఆ మీదట దాన్ని ఆమె అటూయిటూ పరిశీలించి, 'అయ్యో... పిచ్చి శశీ....దీనిమీద పేరు వేయించుకోలేదేం...ఇంతింత ఖరీదువి మెడలో ఉంచుకుని పేరు వేయించుకోరూ...ఎవరి పేరు వేయించుకోవాలో కొంపతీసి మీ ఇద్దరిమధ్యా గొడవొచ్చిందేమిటి....' అని నవ్వి, కాస్త మెల్లిగా, 'ఈమధ్య మన కాలనీలో దొంగలు తెగపడుతున్నారు...ఎందుకైనా మంచిది...పెట్టిలో మాత్రం దాచకు. ఎప్పుడూ మెడలోనే ఉంచుకో...కొంచెం జాగ్రత్త' అని, ఆ వస్తువును తిరిగి శశికిచ్చేసి, 'శశీ....మీ బావగారికి రావలసిన డబ్బు అందలేదు. ఓ అయిదు రూపాయిలుంటే సర్దుబాటు చేద్దూ...ఎల్లుండి ఇచ్చేస్తాను' అంది. అలా అని, 'ఔనుగాని శశీ...మీ ఎదురింటావిడ ఆ లేడీరామారావు...ఆ పేరుతో పిలవడమంటే నాకు చెడ్డ అసహ్యం. పేరు సత్యవతి అయితే మొగుడి పేరుతో పిలిపించుకోవడమేమిటీ...మొగమ్మాయిలా....ఇంతకీ ఈమెగారు నీతో మాట్లాడుతున్నట్లు లేదేమిటి? నిన్నేమైనా అందా? ...అనేరకం కూడాను. సావిత్ర కెంత పొగరో...ఈవిడగారి కంతకు రెట్టింపుంది' అని ఆగింది.

శశి ఏమీ మాట్లాడకుండా ఎంత త్వరగా ఈ ఇల్లాలు ఇక్కడనుంచి తరలిపోతే అంత మంచి దనుకుంటూ, ఆమె

అడిగిన అయిదు రూపాయిలూ ఆమె చేతిలో పెట్టి, 'ఆవిడ మంచివారండి...మేం మాట్లాడుకోకపోవడమేమిటి ... ఎవరన్నారు'...అంది. వెంటనే లక్ష్మీదేవి, ఆఁ....అలాగా...ఆ కళ్ళజోడు పంతులమ్మ, ఆ సిల్కు శరీరం తాయారు, ఎంత జిత్తులమారి నక్కలనుకున్నావ్...వాళ్ళకూ వీళ్ళకూ ముడిపెట్టడమే వీళ్ళపని...చిట్టివసంతం కొంత నయం. ఆపిల్ల చక్కగా పాటలు నేర్చుకోక వీళ్లతో తిరిగి ఎందుకూ పనికిరాకుండా పాడై పోతూంది. ఇంతకీ అలా ఎందుకన్నారో....నీకూ లేడీరామారావుకూ అసలుపడటమే లేదన్నారు. అయితే తెలియక అడుగుతాను సావిత్రికి, ఈవిడగారికి ఈ మధ్య కలిసినట్లుందేఁ...ఏమిటీ కథ....'అంది.

వెంటనే శశి చక్కగా నవ్వి, 'కలవడం మంచిదే కదాండి....అదేగా మనం కోరవలసింది' అంది.

వెంటనే లక్ష్మీదేవి తబ్బిబ్బైపోయి, రాని నవ్వును మొగంమీదికి పిండుకొని, 'బాగా చెప్పావమ్మాయ్...వస్తాను మరి...' అంటూ అక్కడ నుంచి చల్లగా జారుకుంది.

వెళుతూ వెళుతూ తిన్నగా ఇంటికి వెళ్ళిపోకుండా లేడీ రామారావుంటూన్న ఇంటివైపు ప్రయాణించింది. లక్ష్మీదేవి ఆ వైపు బయలుదేరడం చూడగానే శశి, హడలిపోయింది. అక్కడకుపోయి ఏం చెప్తుందో అని భయపడి పోయింది. 'ఈ నిందలుచాలు భగవంతుడా...నన్నీ చీకటిలోంచి త్వరగా బయట పడవేయి స్వామీ' అనుకుంది.

ఎప్పుడైతే శశి దగ్గఱనుంచి లక్ష్మీదేవి తనవైపు రావడం చూసిందో, లేడీ రామారావు ఇక జాగ్రత్తగా ఉండాలి

అనుకుంది. లక్ష్మీదేవి అక్కడనుంచి బయలుదేరడం గమ నించనట్లు అటు తిరిగి కూర్చుంది.

లక్ష్మీదేవి వస్తూనే, 'శశి ఏమందో తెలుసా...' అంది.

లేడీ రామారావు గుండెలు గుభేలుమన్నాయి.

'ఏమమ్మాః... లేడీ రామారావుతో మాట్లాడటం మానేశావు అన్నాను. వెంటనే... ఏం... లేడీరామారావుతో మాట్లాడాలని ఎక్కడైనా రాసిఉందాః... అంది. నేనాశ్చర్య పోయాననుకో... నా నోటివెంట మాట పెగిలిరాలేదు' అని కాస్త ఆగింది.

లేడీ రామారావు, శశికి తన మనసులో అనేక నమ స్కారాలర్పించింది. శశి ఎంత మంచిది... ఈ రాక్షసి కామె ఏమీ చెప్పలేదు. చెప్తే ఈవిడగారు వచ్చే తీరే మరోక రకంగా ఉండును.' అనుకుంది. వెంటనే కోపాన్ని నటిస్తూ, 'అయితే ఇంకా ఏమంది...శశి కెలాగైనా ఈమధ్య తల తిరు గుడుగా ఉంది లెండి...' అంది.

లక్ష్మీదేవి, 'శశి ఎంత దొంగ...' అని తనలో అను కొని, 'అయినా మనదగ్గరా' అని గర్వపడిపోయి, 'తలతిరు గుడే కాదు...పెద్దా చిన్నా లేకుండా ఎలా బడితే అలాగే మాట్లాడేస్తూంది.' అని, 'ఓ రెండు రూపాయిలుంటే సర్దుబాటు చేద్దూ...వెనకటివీ...ఇవీ...ఎల్లుండి ఇచ్చేస్తాను'అంది.

లేడీ రామారావు కసలు లక్ష్మీదేవికి డబ్బు యిచ్చే ఉద్దేశమే లేదు. కాని ఈవిడను కొన్నాళ్లు తనచుట్టూ తిప్పు కోవాలనుకుని, "ఆః...దానికే ముందండి...తీసుకెళ్ళండి...

ఎల్లుండికి కాకపోతే ఇంకో ఏడు నెలల కివ్వండి" అని ఓ రెండు రూపాయలనోటు ఆమె చేతిలో పెట్టింది.

లక్ష్మీదేవి ఇక బతకొచ్చు అనుకుంది. ఆ డబ్బు తీసుకొని తిన్నగా ఇంటికి దారితీసింది.

రామం కాలేజీకి వెళ్ళిపోగానే శశి పుస్తకం తీసి చదువబోయింది. కాని తలనొప్పి ఎక్కువైపోవడంతో పుస్తకాన్ని మూసేసి, "ఈ లక్ష్మీదేవి దగ్గర జాగ్రత్తగా ఉండాలి" అనుకుంది. ఏమైనా ఈ వీధిలోంచి ఎంత త్వరగా వెళ్ళిపోతే అంత మంచిది అనుకుంది. అప్పుడే ఆమె మనసు, "ఏ వీధిలోనైనా ఇలాంటివాళ్ళుండొచ్చు శశీ...ఏమిటో నీ పిచ్చిగాని, మనుషులెక్కడా ఒక్కలాగే ఉంటారు. వాళ్ళతో నువ్వు మసలడంలోనే ఉంటుంది కీలకమంతాను. వాళ్ళు నువ్వనుకొన్నంత అపాయకరమైనవాళ్లు మాత్రం కాదు" అంటూ ఇంకా ఏమేమిటో ఆమెకు చెప్పబోయింది.

కాని శశి అవి వినకుండా మరేమిటో ఆలోచించింది. "అదే చిత్రం ... ఈ మనుషులంతా ఎంతో నీటుగా అందంగా కనిపిస్తారు. వేషం పరిశుభ్రంగా ఆకర్షణీయంగా ఉంటుంది. వీళ్ళనడకలో వీళ్ళు పెంచుతూన్న మొక్కల్లో, వీళ్ళుంటూన్న ఇళ్ళల్లోని సామానుల్లో ఎంతో సౌందర్యం ఉట్టిపడుతూ వుంటుంది. కాని...కాని...వీళ్ళ మనసుల్లోమాత్రం ఇంతింత మలినం ఎట్లా దాగి ఉంటూందో...ఈ సౌందర్యపిపాస మనసువరకూ ఎందుకు పోవడంలేదో...మనసులుకూడా అంత స్వచ్ఛంగా, ఆకర్షణీయంగా ఉంటే బాహ్య స్వరూపంలోనూ అంతరంగంలోనూ ఒక్కలాగే కనిపిస్తే అందరూ ఎంత సుఖంగా

బతకొచ్చు" అనుకుంది. "కాని...కాని...ఇదెలా జరుగుతుంది. వీళ్ళంతా మంచివాళ్లుగా మారడం ఎలా జరుగుతుంది" అనుకుంది. తలగడలో తలదూర్చి ఎంతో దుఃఖించింది.

"ఈ సావిత్రిని నేనెప్పుడూ ఒక్క మాటకూడా అనలేదు. కాని నా నెత్తిని ఎంతటి అపనింద రుద్దింది! ఆమె అనేమాటలు పడి, సహించి నోరు మూసుకొని ఊరుకొంటే మంచిదా..... ఇంత అన్యాయం ఎందుకు తలపెట్టింది...లేడీ రామారావును రక్షించడానికి ఆమెకింతకన్నా మార్గమే దొరకలేదా...అందుకు బలిపశువుగా నేనా దొరికాను." పాపం శశి దుఃఖం కట్టలు తెంచుకుంది.

ఆ సాయంకాలం రామం వచ్చేప్పటికి, శశి ఎంతో దిగులుగా, జబ్బుపడిపోయిన దానిలా మంచంమీద పడుకొనిఉంది. అతనికి శశిని ఆ స్థితిలో చూడగానే జాలివేసింది. ఈ దిగులుతో ఆమె ఏమైపోతుందో అన్న భయం వేసింది. బాధతో కుమిలిపోతూన్న ఆమె మనసు అతని ఎదుట ప్రత్యక్షమై "నాకిక సుఖములేదా!..." అన్నట్లు చూసింది.

రామం మెల్లిగా, "ఇల్లు ఎక్కడా దొరకలేదు శశీ... ఉన్నవి అంతమంచి ప్రదేశాల్లో లేవు...రేపు మళ్ళీ చూస్తాను." అన్నాడు.

శశికి బావురుమని ఏడ్వాలనిపించింది. ఆమె కళ్ళవెంట వెచ్చని కన్నీళ్లు రాలాయి.

రామం, "లే శశీ...ఛీ...ఆ సావిత్రి ఏమిటో ఎవరినో రక్షించడానికి నోటికొచ్చినట్లు వాగితే, ఇలా ఇంత బాధపడట

మేమిటి...ఇదేమీ బాగులేదు." అని మెల్లిగా ఆమె కన్నీళ్ళను తుడిచాడు. "లేడీ రామారావు రక్షింపబడటం నీకిష్టమేగా...ఒకమనిషి నిండుప్రాణాన్ని కాపాడిన కీర్తి నీకు తప్ప ఇంకెవ్వరికీ రాదు. శశీ...ఇది సావిత్రి ప్రతిభ అనుకుంటున్నావేమో...ఆ సమయంలో కిక్కురు మనకుండా ఇంటికి వచ్చేసిన నీ సహనభావానిది శశీ ఆ ప్రతిభ....కాని ఈసంగతి ఎవ్వరికీ తెలియకపోవొచ్చు. కాని, నేను గుర్తించాను. అది నీకు చాలదూ...శశీ...సావిత్రి ఏదోకూస్తే అయిపోయిందా... నిన్ను నేనెరుగనూ..." అన్నాడు.

శశి, రామం కళ్ళల్లోకి అలాగే చూస్తూ "మీరు నా ప్రాణం...నా ప్రాణం..." అనుకుంది. అతని చేతిని తనచేతుల్లోనికి తీసుకొని చెంపలకు నిమురుకుంది.

## 4

లక్ష్మీదేవి మరునాడు ప్రొద్దున్నే శశి దగ్గరకొచ్చి, "అవసరానికిచ్చి ఎంతో ఆదుకున్నావమ్మా... నీ సహాయం మరచిపోను..." అంటూ శశి ఇచ్చిన అయిదురూపాయిలూ తిరిగి ఇచ్చేసింది.

లక్ష్మీదేవి ఇంత త్వరలో బాకీ తీర్చేస్తుందని శశి ఎప్పుడూ అనుకోలేదు. ఆమె ఎంతో ఆశ్చర్యపోయింది. లక్ష్మీదేవి కొంచెం మారింది అనుకుంది.

కాని అప్పుడే లక్ష్మీదేవి, "ఆ లేడీ రామారావుకు నీకున్న పాటిబుద్ధేనా లేదు శశీ...నిన్న ఏమందో తెలుసా... ఆవిడతో నీకు విరోధమే లేదని నువ్వన్నావు...కాని ఆ మనిషి

నీ అంత పొగరుబోతుదాన్ని ఎక్కడా చూడలేదని అంది. చూశావా...ఎలాగున్నారో రోజులు. వస్తాను. అయిదు రూపాయలనోటు జాగ్రత్తచేశావు కదూ...సమయానికి సర్దు బాటు చేశావు..." అంటూ అక్కడనుంచి వెళ్ళిపోయింది.

ఆ వెళ్ళడం వెళ్ళడం తిన్నగా సావిత్రి ఇంటికి వెళ్ళింది. సావిత్రి సోఫామీద కూర్చొని పనివాళ్ళకు పనులు పురమా యిస్తోంది. ఆవిడ భర్త మాధవరావు ఇంటి వ్యవహారాలేమీ పట్టించుకోడు. అన్నీ సావిత్రే చూసుకుంటుంది. అతను ఎప్పుడూ ఏదో ఒకటి చదువుకుంటూ కూర్చుంటాడు. భగవద్గీతో, భారతమో వల్లిస్తూ నిద్రపోతాడు. లేకపోతే ఉన్న ఒకేఒక్క మిత్రుడి ఇంటికిపోయి రమణమహర్షి జీవితం గురించి, అరవిం దుని ప్రతిభా విశేషాల గురించి తర్క వితర్కాలు జరిపి, ఇంటికి ఇన్ని పుస్తకాలతో తిరిగివస్తాడు. భోజనంచేసి మళ్ళీ ఆ పుస్తకాలలో మనసును ప్రవేశపెట్టి, తనూ ఓపుస్తకమై పోతాడు.

అతడు జ్ఞాని. అతని కేపీపట్టవు. అతని మనసు బాహ్య ప్రపంచంలో జరిగే ఏ విషయంలోనూ ఎప్పుడూ ప్రవేశించదు. ఉన్న ఒక్క కూతురుకూ పెళ్ళి అయిపోయింది. ఆమె సుఖంగా సబ్ కలెక్టరయిన భర్తతో విజయనగరంలో కాపురం చేస్తోంది. పల్లెటూళ్ళోని అన్నగారు, తన యింటికి కావలసిన సమస్తాన్నీ నెలనెలా పంపి ఏ లోటూ లేకుండా చూస్తూఉంటాడు. అప్పు డప్పుడు వచ్చి క్షేమ సమాచారాలు కనుక్కొని వెళ్తూ వుంటాడు. ఇక ఇంటిదగ్గరఆ తెలివైన సావిత్రి ఉండనేఉంది. అతని జీవితం నిశ్చింతగా వెళ్ళిపోతోంది.

ఆ సంఘటన జరిగినప్పటినుంచీ పాపం సావిత్రి ఎంతో బాధ పడుతూనే ఉంది. పతనమైన ఓ స్త్రీని రక్షించడానికి ఒక ఉత్తమురాలిని బలివేయడం ఆమెకు చాల వ్యథ కలిగించింది. 'ఏమిటో...ఆవేళ అంతకన్నా ఏమీ తోచలేదు' అనుకుంది. 'అయినా ఈ విషయం శశికి తెలియదనుకో...కాని లేడీరామారావు భర్త శశిని మరి ఏమని ఊహించుకుంటాడు? ఆ తెలివి తక్కువ పెద్దమనిషి, ఎవరి ముందైనా ఈ విషయాన్ని లాగి శశి మంచిది కాదని ప్రచారం చేస్తే...పాపం శశి జీవితం ఏంగాను? ఈ విషయం శశికిగాని రామానికిగాని తెలిస్తే అప్పుడేమౌతుంది...ఛీ...తను మంచి పని చేయలేదు. నిజానికి తనకు శశి నచ్చినట్లు ఈ వీధిలో ఎవ్వరూ నచ్చలేదు. కాని తను ఆ శశికే అపకారం చేసింది. మంచి చేయబోయి చెడ్డ చేయడమంటే ఇదే కాబోలు...అనుకుంటూ అప్పుడే వచ్చిన నౌకరుకు ఏదో పనిచెప్పి అతన్ని పంపించింది.

ఆ సమయంలో లక్ష్మీదేవి, ఆ గదిలో ప్రవేశిస్తూనే, 'శశి చూశారూ...ఎటువంటి మాటందో' అంది.

సావిత్రి వినడానికి వీలుగా కూర్చుంది. లక్ష్మీదేవితో, 'అలా కూర్చో' అంది. లక్ష్మీదేవి కూర్చోకుండానే, 'లేడీ రామారావుకు, శశికి మీరు విరోధం పెట్టారటగా...'అంది.

సావిత్రి తాపీగా, 'ఎవరన్నారు?' అంది.

"ఇంకెవరంటారండి... ఆ తలబిరుసు శశే"... అంది లక్ష్మీదేవి.

ఈ మాటకు సావిత్రి నవ్వింది.

సావిత్రి, విరోధులమాట విన్నప్పుడు నవ్వడమంటే పగబట్టడమన్నమాట. ఈ అర్థం లక్ష్మీదేవికి బాగా తెలుసు. సావిత్రి మెల్లిగా, 'ఊఁ...ఇంకా ఏమంది' అంది.

"ఈ వీథిలోంచి మీరు వాళ్ళను గెంటెయ్యాలని చూస్తున్నారటగా..." అంది. శశి నోటివెంట ఈమాటలు విన్నట్లూ, అప్పుడు తనెంతో బాధపడి పోయినట్లూ చెప్పింది.

సావిత్రి తాపీగా, 'చాలదూరం వచ్చాయన్నమాట... మాటలు...' అంది.

లక్ష్మీదేవి సంతోషించింది. వెంటనే, 'ఛీ...ఇలాంటి దుష్టులుండేచోట ఉండగూడదు. అందండీ...ఎంతపొగరు!"... లక్ష్మీదేవి మొగం కోపంతో ముడుచుకుంది.

తాపీగా సావిత్రి, "పోనీ లక్ష్మీ...శశి చిన్నది. మా అమ్మాయి ఎంతో ఆపిల్ల అంత. అలా ఆమె అనుకున్నంతలో నాకు పోయేదేముంది..." అంది.

లక్ష్మీదేవి తన గుండెల్లో అమితోత్సాహ పడిపోయింది. సావిత్రి ఎంత తియ్యగా మాట్లాడితే అంతపెద్ద గొయ్యి తవ్వడానికి మార్గాలాలోచిస్తుందని ఆమెకు తెలుసు.

"వస్తానండీ...ఊరికే ఒకసారి చూసిపోదామని వచ్చాను. అమ్మాయి బాగుందాండి... ఈ మధ్య రావడం మానేసింది. ఔన్లెండి...కలక్టరుగారి భార్యకు తీరికెక్కడుంటుంది" అని తనేదో నవ్వుకోడానికి వీలైనమాట అన్నట్లు నవ్వి, "వస్తానండి...." అంటూ ఇంటికి కదలిపోయింది. శశి అంటే సావిత్రికి పూర్తివిరోధముందని ఎంతో సంతృప్తిపడింది.

* * *

ఆవేళ సోమవారం. రామం కాలేజీకి అప్పుడే వెళ్ళి పోయాడు. శశి చాకలి తెచ్చిన బట్టల్ని పెట్టెలో సర్దుకుం టోంది. అప్పుడే లక్ష్మీదేవి ఆగదిలోకొచ్చి, 'బట్టలు సర్దు తున్నావు....ఎక్కడికేనా ప్రయాణమేమిటి శశీ...'అంది.

శశి, అబ్బే...చాకలి బట్టలు తెచ్చాడు. పెట్టెల్లో సర్దుతున్నాను' అంది.

అప్పుడు లక్ష్మీదేవి అక్కడ అద్దం ఉంటే ఒకసారి తన మొగాన్ని అందులో చూసుకొని, ఊడిపోయి రోజురోజుకూ పల్చబడి పోతూన్న తన తల గురించి ఎంతో బెంగపడిపోయి, 'ఈ మధ్య జబ్బుపడిన తరువాత, తల పూర్తిగా ఊడిపోతోంది' అంది. ఇదే విషయం మీద ఓరోజున సిల్కుశరీరం తాయారు, 'వదినగారూ....మీకు చక్కని విగ్గు అవసరమండీ'....అందట. ఆ రోజున పెద్దగొడవై పోయిందట. ఈ విషయం ఆ వాడ వాడంతా పాక్కిపోయింది. ఈ సంగతి శశికికూడా తెలుసు. అందుకనే పాపం ఆమె ఈమాట వినగానే ఆమె పెదవుల మీదికి నవ్వు ఉషారుగా పొంగుకొచ్చింది. ఆ నవ్వుచూసి, లక్ష్మీదేవి లోలోన 'నిన్నేం చేస్తానో చూడు' అనుకుంది. మెల్లిగా తను వచ్చిన పని చెప్పబోసాగింది.

'ఎందరిని అడిగావనుకున్నావ్ శశీ....'అని ఆమె కళ్ళ ల్లోకి చూసింది. శశి నవ్వు హరించి పోయింది.

'ఒక్కరూ ఇచ్చారు కారు. అవసరా లనేది ఇక వాళ్ళకు రానేరావో ఏమిటో....' అని ఆగింది.

శశి, మళ్ళీ ఈవిడగారికి అప్పుకావలసివచ్చింది కాబోలు అనుకుంది. మెల్లిగా, 'ఏమిటండీ' అంది,

లక్ష్మీదేవి ఆరంభించింది.

'అది కాదు శశీ.... రేపు కాకినాడలో మా బావగారి కొడుకు పెళ్ళి. మేం వెళ్ళక తప్పదు కదా... నేను వెళ్ళడం లేదనుకో...మా పార్వతీ ఆయనగారూ బయలుదేరుతున్నారు. అది ఎలాగే ఈ బోసిమెడతో వెళ్ళడం అంటూ ఏడుస్తూ కూర్చుంది...నా దగ్గర ఉన్నప్పుడు ఎంతమంది కిచ్చేదాన్ని. అడగనివాళ్ళదే పాపం. ఒకసారి ఏమయిందనుకున్నావ్...మా దాసీది....మా మేనత్తకొడుకు పెళ్ళికెళతానండీ. మూడు రోజులు పనిలోకి రానండీ....అంది. అలాగే వెళ్ళవే అన్నాను. అప్పుడు నాదృష్టి దాని మెడమీద పడింది. అది బోసిగా చిన్నబోయి ఉంది. నాకు అదోలా అనిపించింది. వెంటనే అదేమిటే...అలా బోసిమెడతో ఎలావెళ్తావే ఈ గొలుసు తీసికెళ్లు అన్నాను. అది ఎంత ఉబ్బితబ్బిబై పోయిందను కున్నావ్...కాని రోజులన్నీ మనవికావుగా ఇప్పుడు మా రోజులు బాగులేవని, వీళ్ళంతా నన్నిలా అవమానపరచడం ఏంబాగుంది చెప్పు శశీ..." అంది.

శశి మెదడులో భయం, "జాగ్రత్త...జాగ్రత్త"అంది. కాని శశి ఏమీమాట్లాడలేకపోయింది.

"ఈ చిన్ని ఉపకారమూ చేసిపెట్టు శశీ.... ఎల్లుండి నీ వస్తువు ఎలాఇచ్చావో అలా పువ్వుల్లోపెట్టి ఇచ్చేస్తాను" అని శశి కళ్ళల్లోకి దీర్ఘంగా చూసింది.

శశి ఏమిటో చెప్పాలనుకుంది. కాని, మూడో నాడు తెచ్చిఇచ్చేస్తుందికదా అనుకొని "అలాగే పట్టికెళ్ళండి..."అని ఆ వస్తువుతీసి ఆమె చేతి కిచ్చేసరికి లక్ష్మీదేవి హమ్మయ్య అను

కుంది. సాధించాను అనుకుంది. ఎంతో సంతోషాన్ని ప్రకటించింది. శశిని ఎంతో పొగిడింది. ఇంటికి ఆ చంద్రహారంతో దారితీసింది.

శశికి ఆరాత్రి నిద్రపట్టలేదు. ఈ విషయం రామాని కామె చెప్పలేకపోయింది. కాని మూడో రోజున లక్ష్మీదేవి ఆ వస్తువును తెచ్చి ఇవ్వకపోవడంతో ఆమె మనసులో వణికింది. లక్ష్మీదేవిని, ఆమె భర్త భూషణాన్ని ఒకసారి తలచుకుంది. ఎంతో భయపడింది. రామం చెవిని ఈ విషయం వేసింది.

రామం, "ఇస్తుందిలే...ఎక్కడికి పోతుంది. అంత దగ్గర బంధువుల ఇంటికి వెళ్ళినప్పుడు వెంటనే ఎలా తిరిగివస్తారు...." అన్నాడు.

శశి, "అదికాదండి...మరి వాళ్ళాయన వచ్చేశాడుగా ....కనీసం వాళ్ళమ్మాయి ఇక్కడికెప్పుడు వచ్చేదీ మర్యాదకైనా చెప్పాలా..." అంది.

రామం, "అవుననుకో...కాని అలా చెప్పాలని అందరికీ తోచొద్దూ... ఇస్తుందిలే...." అని బయటకు వెళ్ళిపోయాడు.

శశి మరునాడు చూసింది. కాని లక్ష్మీదేవి అటు తొంగిచూడలేదు. "ఏమిటిలా చేస్తోంది" అనుకుంది. ఒకసారి ఆమెదగ్గరకు వెళ్ళిరావాలనుకుంది. కాని అలా చేయలేకపోయింది. కొంపదీసి లక్ష్మీదేవి మోసంచేయదుకదా అనుకుంది. ఈ ఒక్కరోజుకూ ఓపికపట్టి, రేపు వాళ్ళింటికి వెళ్ళి ఏ సంగతీ తేల్చుకుంటాను" అని నిర్ణయించుకుంది.

మరునాడు పొద్దున్నే శశి మనసులోని భయాలనన్నిటినీ తోలెయ్యడానికా అన్నట్లు లక్ష్మీదేవి శశిదగ్గర కొచ్చింది. శశి, "ఛీ ... ఎంత అనుమానించాను.... డబ్బు ఎంతపని చేస్తుంది..." అనుకుంది.

లక్ష్మీదేవి సన్నగా నవ్వుతూ, "ఒక్క నాలుగురోజులు ఓపికపట్టు శశీ...అమ్మాయి అలా వాళ్ళ తాతగారింటికెళ్ళింది. ఒకటి రెండు రోజులటో ఇటో వచ్చేస్తుంది. ఈ సంగతి నిన్ననే చెప్పాలనుకున్నాను. వీలయిందికాదు. ఏమీ అనుకోకూ!" అంటూ అక్కడనుంచి వెళ్ళిపోయింది. శశి మంచంమీద అలాగే కూలబడిపోయింది. చేతులారా తను కష్టాలను తెచ్చి పెట్టుకుంటూన్నట్లు దుఃఖించింది.

రామం ఎంతో మంచివాడు. ఆమెకూ అతనికీ అసలు గొడవలే లేవు. వాళ్ళది ఎంతో చక్కని దాంపత్యం. కాని పాపం వాళ్ళకు సుఖంలేకుండా పోతోంది.

ఒకవారం గడిచింది. రెండువారాలు గడిచాయి. లక్ష్మీదేవి ఇక ఇటు రావలసిన అవసరం లేనట్లు ఊరుకుంది. ఒకసారి తాయారు కనిపిస్తే, శశి, ఆమెకే విషయమంతా చెప్పింది. తాయారు, లేడీ రామారావుకు కాని, సావిత్రికి కాని చెప్పి చూడమంది. ఈ మాట వినగానే శశి మొగం వివర్ణమైపోయింది. ఆ తరువాత శశి, లక్ష్మీదేవి ఇంటిచుట్టూ రెండు మూడు సార్లు తిరిగింది. సాకులు చెప్పాలనుకోవాలేగాని లక్ష్మీదేవి లాంటి వారికి కొదవ ఏముంటుంది. ఆమె తియ్యగా ఏవేవో కల్లబొల్లిమాటలు చెప్పి శశిని ఇంటికి పంపేస్తూ ఉంది.

శశి రోజూ వాళ్ళింటికి ఎక్కడ తిరగ్గలదు? అందులో ఇలా తిరగడానికి ఆమె హృదయం ఎంతో అసహ్యించుకుంటోంది.

* * *

అలా అలా ఓ నెలరోజులు గడచిపోయాయి. రోజులు గడచేకొద్దీ విషయం గడ్డు సమస్యగా తయారౌతోంది. రామానికి ఏంచెయ్యడానికీ తోచలేదు. ఈ వ్యవహారం పోలీసుల చేతిలో పెడితే పరిస్థితులు చాల విషమిస్తాయి. అందులో అతనికి పోలీసులతో వ్యవహారమంటే అసలు నచ్చనే నచ్చదు. అయినా వాళ్ళతో చెపుదామనుకున్నా ఆ నగమీాద పేరులేదు. అది ఇస్తూండగా చూసినవాళ్ళ సాక్ష్యం లేదు. ఇక సావిత్రీ, లేడీరామారావులు ఆ లక్ష్మీదేవితరఫునే సాక్ష్యం చెప్తే అసలుకే మోసం వస్తుంది. ఇంతకీ వాళ్ళానగను తాకట్టే పెట్టారో, దాని రూపమే మార్చేశారో తెలియదు. ఇవన్నీ ఆలోచిస్తూ వుంటే పాపం రామానికి తల తిరిగింది. ఈ విషయాలన్నీ శశికి చెప్పేటప్పటికి శశి మొగం పాలిపోయింది. 'సుమారు రెండువేల రూపాయల ఖరీదైన ఆ హారానికి నీళ్ళు వదులుకోవలసిందేనా...ఇక మార్గమే లేదా....ఈ దొంగలకు బుద్ధిచెప్పే వాళ్లెవ్వరూ ఈ వాడలో లేనేలేరా...ఇంతేనా... ఇంతేనా....ఈ అన్యాయాన్ని ఇలా సహించవలసిందేనా...' అని గట్టిగా ఆమెలో ఎవ్వరో అరచారు. అంతే. ఆమె మొగంలోనికి కోపం పాములా ప్రాకింది. ఆమెలోని ప్రత్యణువునా ప్రతీకారేచ్ఛ బుసలు కొట్టింది. ఆమె ఆత్మలోని పరమాణువులు విచ్ఛిన్నమైపోతూ ఆమెలో అవమానాన్ని సహించలేని ఆవేశాన్ని సృష్టించాయి. ఆమె ఇక అక్కడ ఒక్క క్షణం

నిలువలేకపోయింది. రామం, 'ఆగు శశీ...' అంటూన్నా అది ఆమె వీనులకు సోకనేలేదు. ఆమె అక్కడ కెలా చేరిందో ఆమెకే తెలియదు.

మూసి వున్న తలుపును గబాలున తోసింది. ఆ రెక్కలు పక్కనున్న గోడలకు గ్రుద్దుకొని 'దబ్' మని భయంకరంగా ధ్వనించింది. శశి జుట్టు చెదరిపోయింది. ఆమె కనులలో జ్వాలలు రేగుతున్నాయి. ఒక్కసారిగా ఆమె మాట తీక్షణమై కర్కశమై, 'ఇలా ఎన్నాళ్లు తిప్పుతారు' అంది. ఆమె కంఠం లోంచి ఆమె ఆత్మ, స్వచ్ఛమైంది, పరిశుద్ధమైంది-ప్రళయంగా ప్రశ్నించింది.

అప్పటి శశి రూపాన్ని లక్ష్మీదేవి చూడలేకపోయింది. ఇక మామూలుగా మాట్లాడి లాభం లేదనుకుంది. ఆమె తన నిజస్వరూపాన్ని ప్రత్యక్షం చేసింది. 'నిన్నెవరు తిరగమన్నారు శశీ?...వెళ్ళి ఇంటిదగ్గర తిన్నగా కూర్చో. అనవసరంగా తిరక్కు. కాళ్ళు నొప్పులు పెడతాయి' అంది.

శశి కోపం ఆకసాన్ని చేరింది. "అయితే ఇవ్వరా...." అంది. నిజాయితీగల మనిషి, నీతిగల మనిషి ఒక్కటే మాట అంది. కత్తిలా అంది. అది లక్ష్మీదేవి గుండెల్ని గుచ్చుకుంది.

లక్ష్మీదేవి విజృంభించింది. సత్యానికి చావుదెబ్బ ఒకే ఒక్క అసత్యం....ధర్మబద్ధమైన ఆత్మ విని సహించలేని అబద్ధం....'ఏమిటి నీకివ్వాలి... అనవసరంగా వాగకిక్కడ గుమ్మం దిగు ముందు....' అంది.

శశి ఆత్మలోని ఆత్మ ఆ అనృతాన్ని విని కూలిపోయింది. శశి తూలి క్రిందపడిపోయింది.

అప్పుడే ఆ గుమ్మంలో, సావిత్రి లేడీ రామారావులు అడుగుపెట్టారు. లక్ష్మీదేవి కంగారు పడిపోయింది-ఆందోళన పడిపోయింది. 'ఇంకా వెళ్ళవేం శశీ ... నీ క్కాదు చెప్తూంటే...' అని శశిని అక్కడనుంచి గబాలున లేవదీసి, 'రండి....' అంటూ ఆ వచ్చిన వాళ్ళకు ఆసనాలు చూపింది.

శశి ఒక్కసారి సావిత్రి, లేడీ రామారావులవైపు చూసింది. మీరు కూడా ఇందులో భాగస్వాములా అన్నట్లు ఆమె చూపులు వారిని కలవరపెట్టాయి. సావిత్రి, శశిని ఒక చేత్తో పట్టుకొని, 'ఏమిటి లక్ష్మి, శశిని ఏమి చేశావు' అంది.

లక్ష్మీదేవి దీనికి సమాధానం చెప్పలేదు. 'వెళ్ళనివ్వండి శశిని, ఏ మనిషితో ఎలా మాటలాడాలో కూడా తెలియదు' అంది.

సావిత్రి చిరునవ్వు నవ్వుతూ, "అవునవును...నీకు తెలిసినట్లు అందరికీ ఎలా తెలుస్తుంది? నీకున్న అనుభవంలో శశికున్న అనుభవం ఎన్నోవొంతు" అంది.

'అబ్బే...ఆదేమీలేదండి...'అంటూ లక్ష్మీదేవి, ఏమిటిలా పరిణమిస్తోంది...అని హడలిపోయింది. ఏమి చెప్పాలో తోచక గోడలాంటి అబద్ధాన్ని అంత అర్జంటుగా కట్టెయ్యడానికి ఆమె చిన్నరకం మెదడుకు బలం చాలిందికాదు పాపం!

అప్పుడు సావిత్రి, 'ఏమిటి శశీ...' అంది. శశి ఏమీ మాటలాడలేదు. లక్ష్మీదేవివైపు తీక్షణంగాచూసి ఊరుకుంది.

సావిత్రి, 'శశి చిన్నపిల్ల కాబట్టి పెద్దదైన లక్ష్మీదేవి చెప్పడమే మరి న్యాయం—న్యాయానికి కట్టుబడి సంగతేమిటో

చెప్పరా లక్ష్మీదేవిగారూ!...' అంది. సన్నగా నవ్వును గలగలలాడించి, 'మాకు చెప్పగూడని రహస్యం కాబోలు!" అని ఎత్తి పొడిచింది.

లక్ష్మీదేవి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. 'అబ్బే ఏముందండీ...ఏమీలేదు. మీకు చెప్పగూడనిదేమీలేదు....శశిని పోనివ్వండి. నేను తరువాత మీకు చెప్తాగా!...' అంటూ, 'దాహం ఇమ్మంటారా, ఇలా ఎక్కడినుంచి వస్తున్నారు' అంది.

వెంటనే సావిత్రి, 'ఎక్కడనుంచో రావడమేమిటి... ఇక్కడికి రావాలనే మేం వచ్చాం...నీదగ్గర దాహం తీర్చుకోడానికి రాలేదు. నీదగ్గరనుంచి మా శశిని క్షేమంగా తీసుకుపోవాలనివచ్చాం' అంది.

లక్ష్మీదేవి గుండెల్లో పూర్తిగా రాయి పడిపోయింది. ఆమె నిర్ఘాంతపోయింది. మెల్లిగా, 'మీ మాటలు నాకర్థం కావడంలేదండీ' అంది.

వెంటనే సావిత్రి, 'అర్థం పోతూంటే...నీకర్థంకాదులే' అంది.

ఈ మాటలోని అర్థగాంభీర్యాన్ని అర్థం చేసుకున్న శశి, ప్రసన్నవదనంతో సావిత్రి కళ్ళల్లోకి చూసి, ఇంతలోనే సిగ్గుతెర కమ్మి తల దించుకుంది.

తిరిగి సావిత్రి హుషారుగా నవ్వుతూ, "నాకంతా తెలుసు లక్ష్మీ...నీ నాటకాలు నాదగ్గర పనిచెయ్యవు" అంది.

లక్ష్మీదేవి విలవిలలాడుతున్నకుంది. 'ఏమిటండీ...మా ఇంటిదగ్గరకొచ్చి నన్నే అంటున్నారు' అంది.

పకపక నవ్వుతూ సావిత్రి, 'జైలు కటకటాల దగ్గిరికే వచ్చి చెపుదాం అనుకున్నాం. కాని ఎందు కంత శిక్ష అని మీ ఇంటిదగ్గరికే వచ్చాం...నీకిది ఇష్టం లేకపోతే పోనీ అక్కడికే వస్తాం... ఏం .... ఏం చెయ్యమంటావ్....' అంది. లక్ష్మీదేవి ప్రాణాన్ని పైకి ఊడలాగుతూ.

పాపం లక్ష్మీదేవి మొగంలో భయం విలవిల తన్నుకుంది. 'ఏమిటండీ.. మీరు మాట్లాడేది....' అంది ఇంకా అదేమిటో తెలియని దానిలా.

సావిత్రి లక్ష్మీదేవి ప్రాణాల్ని గిల్లుతూన్నట్లు నవ్వి, 'పోనీలే...నువ్వు చెప్పొద్దులే....ఏమిటె శశీ...ఎన్నాళ్ళయింది నువ్విచ్చి' అంది అటు తిరక్కుండానే.

'సుమారు రెండు నెలలయిందండీ...' అంది శశి. దేవదూతలా వచ్చిందా ఈ సావిత్రి అనుకుంది.

వెంటనే లక్ష్మీదేవి తేరుకొని, ఇక లాభం లేదనుకొని, 'ఏం ఎక్కడికేనా పారిపోతానా...అమ్మాయి రాగానే ఇచ్చేస్తాను. అది మరి వాళ్ళ తాతగారింటిదగ్గర ఉంది. మరి రావాలా...ఈమాత్రం దానికి మీరంతా కలసి ఇంత రాద్ధాంతం చేస్తారా...' అంది.

సావిత్రి, ముక్కుమీద గుద్దుతూన్నట్లు నవ్వి, 'బలే... బలే...అమ్మాయి తాతగారింటిదగ్గర ఉందికదూ....ఔనౌను ....అది నిజం...కాని అమ్మాయి మెడలోనివస్తువు తాకట్టులో ఉంది...మరి ఇదికూడా నిజమేకదూ...మరి ఇది చెప్పరేం లక్ష్మీదేవిగారూ....' అని, మెల్లగా బుజ్జగించి, బెల్లించి అడుగుతూన్నట్లు 'పెరుమాళ్ళు దగ్గర ఎంతకండీ తాకట్టుపెట్టారూ,..

కొంచెం దయచేసి, సెలవిస్తారూ...అయినా ఇక మీరేం చేస్తారులెండి...కాని ఒకటి మాత్రం తెలుసుకోండి...లక్ష్మీదేవిగారూ...ఈ విషయంలో హేమా హేమీలంతా పని చేశారన్న సంగతి. లేడీ రామారావుగారి భర్త, ఒకటోరకం డిటెక్టివ్‌లా ఈ విషయంలో పనిచేశారు. బయట పోలీసులతో తాయారు సిద్ధంగా ఉంది. సాయంకాలంలోగా తమరు శశి మెడలో ఆ వస్తువును వాళ్ళింటికి తీసుకొచ్చి అలంకరించక పోతే రేపు పొద్దుట తమర్ని జైలులో దర్శించుకుంటాం... అంతకన్నా ఏమి చేస్తాం మరి....మరి సెలవా....' అంటూ బయట కొచ్చేసింది.

శశి, సావిత్రిని ఎట్లా అర్థం చేసుకోవాలో ఊహించలేకపోయింది. 'అబ్బ! ఎంత చక్కగా మాట్లాడుతుంది.' అనుకుంది. 'ఒకసారి మా ఇంటి కొచ్చి వెళ్ళిపోండీ...' అని సావిత్రితోనూ, 'మీరు కూడా రండి' అని లేడీరామారావు, తాయార్లతోనూ అనకుండా ఉండలేకపోయింది.

శశి అలా అనగానే సావిత్రి మొగం బాధతో మగ్గినట్లు కనిపించింది. మెల్లగా 'నీ ఇంటికి రావడానికి నా కర్హత లేదు శశీ.... నేను నా జన్మలో ఎవ్వరికీ చెయ్యని అన్యాయాన్ని నీ కొక్కర్తికే చేశాను. అందులో ఇంత చక్కని శశికి' అని ఆమె శశి తల నిమిరింది. ఆమె బాధలోని తపన ఆమె కన్నులలో శశి చూడగలిగింది. శశిలో గూడు కట్టుకొనిఉన్న బాధలన్నీ ఒక్కసారిగా మాయమైపోయాయి. ఆమె తలలోని జీవాణువులు ఆమె ఆత్మలోని ప్రాణవాయువులు చేయీ చేయీ కలిపి నృత్యం చేశాయి. ఆమె ఏమో చెప్పబోయింది. కాని

ఏమీ చెప్పలేకపోయింది. ఏమీ చెప్పలేకపోయిందేకాని, ఇంటికి వచ్చేవరకు మాత్రం వాళ్ళను వదిలిందికాదు.

ఆ రాత్రి శశి, రామం, వాళ్ళ ఆనందం ఇంతింతకాదు. వారు విషయాల నన్నిటినీ కథలా చెప్పుకున్నారు. లేడీరామా రావు మంచితనం, లక్ష్మీదేవి దొంగబుద్ధి సావిత్రిలోని పెద్ద మనిషి తరహా....అన్నీ అన్నీ ముచ్చటించుకున్నారు.

'మొత్తంమీద సాధించావు శశీ...అందరినీ....అందరి హృదయాలనీ' అంటూ రామం తియ్యగా నవ్వాడు.

ఆ మరునాడు రామం కాలేజీకి వెళ్ళగానే, అతన్ని అనంతపురం కాలేజీలో లెక్చరర్‌గా వేసినట్లు ప్రభుత్వందగ్గర నుంచి అతనికో జాబువచ్చింది.

ఈ వార్త నిమిషాలమీద ఆ వాడ వాడంతా పాకిపోయింది. అనేకమంది శశి దగ్గరకువచ్చి వాకబు చేశారు. చాల మంది 'వద్దండీ, వెళ్ళొద్దండీ' అన్నారు. కొందరు శశి అదృష్టవంతురాలన్నారు. మరి కొందరు శశి ఇక్కడనుంచి వెళ్ళిపోతే ఏదో కొరతగానే ఉంటుందన్నారు.

ఆ మూడోనాడు సావిత్రి పెద్ద డిన్నరుపార్టీ ఎరేంజ్ చేసి, శశిని రామాన్ని ఆహ్వానించింది. అదే రోజున తోటి లెక్చరర్‌గా రొకాయన, రామాన్ని భోజనాని కాహ్వానించడంతో రామం సావిత్రిగారింటికి హాజరు కాలేకపోయాడు.

శశికి ఆ నాడు నిజంగా పండుగదినం. ఆమె చక్కగా ముస్తాబై సావిత్రిగారింటికి బయలుదేరింది. శశి గుమ్మంలో అడుగు పెట్టీ పెట్టగానే, సావిత్రి ఎదురుగావచ్చి శశి చేతికి ఒక

'బుకే' పువ్వులగుత్తి ఇచ్చింది శశి....'అరే....ఇదేమిటండి.... ఇదేమి....ఇదేమిటండి...ఎందుకిదీ ...' అంది.

ఆ 'బుకే' సద్గుణాల రూపంలా ఉంది. మొదట దాని చుట్టూ క్రోటన్సు మొక్కల ఆకులు రకరకాల రంగులతో చక్కని చుక్కలతో మెరసిపోతున్నాయి. ఆ లోపల వాటి చుట్టూ దవనం సువాసనలను వెదజల్లుతోంది. దానిపైన మల్లెపూలు చెండులా, కట్టబడి ఉన్నాయి వాటిమధ్య గులాబీ పూలగుత్తి విప్పారి, గులాబీ వెన్నెల్ని వెదజల్లుతోంది.

'పుచ్చుకో శశీ...' అంటూ సావిత్రి దాన్ని శశిచేతిలో పెట్టి, 'ఇది పుచ్చుకోడానికి అర్హతగల దానివి నువ్వొక్కతివే శశీ...' అంది. అక్కడ ఉన్న స్త్రీలోకమంతా క్షణంపాటు కళకళపాటుపడింది. కాని వెంటనే వాళ్ళంతా, 'అది నిజం...అది నిజం...' అన్నట్లు మిన్నుముట్టేలా చరిచేశారు.

శశి సిగ్గుతో కూరుకుపోయింది. ఆమెలో ఒక నవ్వు, ఒక సిగ్గు, ఒక బాధ, ఒక ఆనందం, ఉవ్వెత్తుగా విమానంలా లేచి, ఆమె నా పరిసరాల నుంచి ఏవేవో దివ్య లోకాల్లోకి తీసుక పోయాయి.

అప్పుడే చిట్టివసంతం పాటలు పాడింది. కళ్ళజోడు పంతులమ్మ పద్యాలు చదివింది. సౌదామిని నృత్యం చేసింది. శశిని తాయారు ఆకసానికెత్తి ప్రశంసించింది. లక్ష్మీదేవి, శశి చేతులు పుచ్చుకొని, 'క్షమించు శశీ....' అంది. శశి ఆనందమే తన ఆనందముగా లేడీ రామారావు ఉత్ఫుల్ల నయనాలతో శశిని వీక్షించింది. ఈ మహోత్సవానికి 'శశి....అర్హురాలు,

అర్ణూరాలు' అనుకుంటూ సావిత్రి శశి బుగ్గలు చిదిమింది. ఇన్నింటితో శశి ఉక్కిరిబిక్కిరి అయిపోయింది.

మరునాడు రైలుకదిలేవేళ, ఇంతమంది స్త్రీలూ శశిని సాగనంపడానికి వచ్చారు. రైలు కదులుతోంది. అందమైన చేతులు పైకిలేచి 'మరచిపోకు....మరచిపోకు' అని దివ్యంగా కదులుతున్నాయి. 'నువ్వు వెళ్ళిన వెంటనే ఉత్తరంవ్రాయాలి. ఇక మేం జ్ఞాపకం ఉండంలే...మరచిపోతావులే.... ఒకసారి ఇక్కడకు వస్తావుకదూ'...అన్నీ అన్నీ...శశి వింటూనే ఉంది. చిరునవ్వే సమాధానంగా ఇస్తూనే ఉంది. రైలు నడక సాగిస్తోంది. లేడీ రామారావు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. శశి ఆమెను కళ్ళతోనే కౌగలించుకుంది. ఆఖరి సారిగా అందరికీ శశి చేతు లెత్తి నమస్కరించింది.

రైలు ఇంకొక కొత్తసొసైటీని శశికి పరిచయం చేయుడానికి ముందుకు సాగింది.

లోపల కూర్చున్న రామం, గుమ్మందగ్గర నిలిచి ఉన్న శశిని అలాగే చూస్తూ, ఉద్రూత లూగిపోతున్న మనసులో 'నా శశీ...నా శశీ' అనుకున్నాడు. కళ్ళతో జుర్రుకున్నాడు.

చేతులూపుతూన్న ఆ స్త్రీలోకాన్ని చూస్తూ శశి, రామాన్ని తన కళ్ళల్లో నింపుకుంది. ఎంత ఆనందంగా ఉంది అనుకుంది. 'అరే...ఇదేమిటీ, ఇదేమిటీ. ఇక్కడే ఉండిపోవా లనిపిస్తోందేమిటి' అనుకుంది.

రైలు వేగంగా ముందుకు సాగిపోయింది.